



కావలిలోని అన్నపుగుంట రైల్వే అండర్ బ్రిడ్జి మార్గంలో వర్షపునీటిలో అవస్థలు పడుతున్న విద్యార్థినిలు



కోతకు గురైన టీపీ గూడూరు మండలంలోని కాటేపల్లి సముద్రతీరం

జోరువాన

- జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం
- రోడ్లపై నీరు... రాకపోకలకు ఇక్కట్లు
- పిడుగుపాటుకు 11 గొర్రెల మృతి, గడ్డివామి దగ్ధం
- పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం
- నేడు, రేపు కూడా వర్షాలు కురిసే అవకాశం
- సాగుకు రైతుల సన్నద్ధం
- ఇందుకూరుపేటలో 73.4 మి.మీ గరిష్ఠ వర్షపాతం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12: నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేని వర్షం కురుస్తోంది. మంగళవారం రోజంతా వాన పడుతుండటంతో నెల్లూరు నగరంలో రోడ్లపైకి నీరు వచ్చి చేరింది. గోతులమయంగా ఉన్న రోడ్లన్నీ జలమయమ య్యాయి. ప్రధానరోడ్లపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అల్పపీడన ప్రభావంతో బుధ,గురువారాల్లో కూడా జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పటికే ఎగువన కురిసిన వర్షాలకు జిల్లాలో జలాశయాలన్నీ జలకళను సంతరించుకున్నాయి. కురుస్తున్న వర్షాలతో రైతులు రబీ సాగుకు సన్నద్ధమవుతున్నారు.

సగటు వర్షపాతం 26 మి.మీ

జిల్లాలో మంగళవారం సగటు వర్షపాతం 26 మి.మీగా నమోదైంది. అత్యధికంగా ఇందుకూరుపేటలో 73.4 మి.మీ , అత్యల్పంగా వింజమూరు, మర్రిపాడు,అనంతసాగరంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు. బోగోలు 43.8, అల్లూరు 41.4, బుచ్చి 39.2, దగదర్తి 28.4, కోవూరు 41.6, సంగం 9.4, కొడవలూరు 49.2, విడవలూరు 54.6, సైదాపురం 23.4, నెల్లూరు అర్బన్ 48.6, లింగసముద్రం 7.2, కందుకూరు 30.2, కొండాపురం 6, గుడ్లూరు 12.4, కావలి 50.2, నెల్లూరు రూరల్ 50.4, వెంకటాచలం 72.4, టీపీ గూడూరు 53.5, ఏఎస్‌పేట 8.8, పొదలకూరు 11.2, ఉలవపాడు 15.4, ఆత్మకూరు 14.2, వలేటివారి పాళెం 3.8, జలదంకి 52.4, ముత్తుకూరు 60.2, మనుబోలు 46.8, రాపూరు 8.2, కలువాయి 8.6, చేజర్ల 10.2, కలిగిరి 9.4 మి.మీ వర్షపాతం నమోదు అయింది.

● సంగంలో వీధుల జలమయం

సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరపి లేని వర్షం తో వీధులన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలో నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. పలు చెరువులోని గుంతలకు స్వల్పంగా నీళ్లు చేరాయి.

ఉదయగిరిలో చిరుజల్లులు

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయగిరి ప్రాంతంలో చిరుజల్లులు కురిశాయి. ఈ కారణంగా గ్రామీణ రహదారులు బురదమయంగా మారాయి.

కుంగిన కల్వర్టు.. తెగిపోయిన రోడ్డు

మనుబోలు, (ఆంధ్రజ్యోతి): చిరుజల్లులకే మండలంలోని అక్కంపేట-కురిచెర్లపాడు

- మిగతా 6లో



కలిగిరి వీధుల్లో నిలిచిన వర్షపునీరు

ఈఎన్‌టీ వైద్యుడి వినూత్న నిరసన

● జీజీహెచ్‌లో నేలపై కూర్చుని రోగులకు వైద్యచికిత్స ● హెచ్‌వోడీ వేధింపులే కారణమన్న డాక్టరు

నెల్లూరు (వైద్యం) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ సుకుమార్ మంగళవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి తనను వేధింపులకు గురి చేస్తుందంటూ ఆయన ఆరోపించారు. ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో నేలపై కూర్చొని రోగులకు వైద్య చికిత్సలు అందించారు. పైగా మంగళవారం సదరన్ క్యాంపు ఉండటంతో దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందించే ముఖ్యమైన రోజు. దీంతో ఈ ఎన్‌టీ విభాగానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ నేపధ్యంలో విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కాలేషాబాషా, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర, అడ్మినిస్ట్రేషన్ అధికారులు డాక్టర్ కళారాణి, డాక్టర్ సుశీల్ నిరసన తెలుపుతున్న డాక్టర్ సుకుమార్ వద్దకు ఆఘమేఘాలపై చేరుకుని, నిరసన విరమించాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ సుకుమార్ మాట్లాడుతూ తనను హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి వేధిస్తున్నదన్నారు. ఆమె సక్రమంగా విధులకు రారని, తాను పేదలకు అరుదైన శస్త్రచికిత్సలు చేశానని, అవి పత్రికలలో కూడా వచ్చాయన్నారు. అప్పటి నుంచి తానంటే ఆమెకు అసూయ అని పేర్కొన్నారు. తాను అడ్మిట్ చేసుకున్న కేషీట్‌లో సైతం తన పేరు కొట్టేసి హెచ్‌వోడీ పేరే రాసుకున్నారని ఆరోపించారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఈఎన్‌టీ విభాగంలో రెండు యూనిట్లు ఉండగా, ఓ యూనిట్‌కు మార్చేసిందన్నారు. ఈ విషయాలను సూపరింటెం డెంట్ దృష్టికి తీసుకు వెళ్లానన్నారు. అంతేకాక హెచ్ వోడీ ఏడాదిన్నరగా తాను వాడుతున్న రివాల్వింగ్ చైర్‌ను తొలగించారని తెలిపారు. ఈ చర్యలకు నిరసనగా ఆందోళన చేపట్టానని వెల్లడించారు. హెచ్ వోడీ చేత వివరణ రాయించుకుంటే తాను నిరసన విరమిస్తానని డాక్టర్ సుకుమార్ తెలిపారు. దీంతో సామరస్యంగా సమస్యను పరిష్కారిస్తామని అధికారులు తెలపడంతో ఆయన నిరసన విరమించారు.



నేలపైనే కూర్చుని నిరసన తెలియచేస్తున్న డాక్టర్ సుకుమార్

'నువ్వెంతంటే'.. కథనంపై

అధికారుల సీరియస్

● జరిగిన సంఘటనపై ఆరా

వెంకటాచలం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇద్దరు అధికారుల మధ్య నువ్వెంత అంటే నువ్వెంత అని మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై జిల్లా ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది.ఈ విషయమై వారు ఆరా తీశారు. గొడవకు కార ణమైన మండలస్థాయి రెవెన్యూ అధికారిపై చర్యలు ఉంటాయని కిందిస్థాయి రెవెన్యూ సిబ్బంది, అధికారులు గుసగుసలాడుతున్నారు. గత ఏడాదిగా ఉన్న ఆ అధికారి శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ మండల స్థాయి రెవెన్యూ అధికారి తన తోటి రెవెన్యూ సిబ్బందిపై కసురు కుంటారని, కార్యాలయానికి పనిమీద వచ్చే ప్రజలు, రైతులపై కూడా దురుసుగా ప్రవర్తిస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసులు ఇస్తే ఫైళ్లపై సంతకాలు పెడతారని, లేకుంటే తిరస్కరి స్తారన్న విమర్శలున్నాయి. ఆ అధికారిపై గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో రైతులను దోచుకుని తిన్నాడన్న ఆరోపణాలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం నెల్లూరులో డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ పొందటానికి అభ్యర్థులు ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమాధికా రి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొల్లి ప్రసూన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 16 నుంచి శిక్షణ మొదలవుతుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థుల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలని, టీటీసీ, టెట్ అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ నకళ్లు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలతో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న తమ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు అందచేయాలన్నారు. పూర్తి వివరాలకు 9381554779, 9390239588 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అడ్డుకట్ట పడేనా ?

- నల్లబజారులో యథేచ్ఛగా ఎరువుల విక్రయం
- మండుతున్న యూరియా, డీఏపీ ధరలు
- ఫలించని సొసైటీల ద్వారా అమ్మకాల యత్నం
- 14 పీఏసీఎస్‌లకు అనుమతించినా ఒకచోటే అందుబాటులో...
- రైతు సేవా కేంద్రాలకు అప్పగిస్తే సమస్యకు పరిష్కారం



నల్లబజారులో ఎరువుల విక్రయాల నియంత్రణకు ప్రభుత్వ యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. యూరియా, డీఏపీ బస్తాకు రూ. 100 నుంచి రూ. 150 వరకు అదనంగా చెల్లించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. నెలరోజులుగా ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ సమస్య ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు నిర్దిష్టమైన చర్యలు చేపట్టకపోవటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇదే అదనుగా రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటూ రెండుచేతులా సంపాదిస్తున్నారు.

6

చెప్పడానికి ఆయనెవరు ?

- అంతా మా ఇష్టం.. అన్నట్లుగా రెవెన్యూ తీరు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ హెచ్చరించినా డోంట్‌కేర్
- అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా రెవెన్యూ శాఖ
- ప్రతివారం సగానికిపైగా సమస్యలు ఆశాఖవే...
- పరిష్కారం కాక బాధితుల ప్రదక్షిణలు
- తాజాగా 15 మంది తహసీల్దార్లకు మెమోలు
- ఇప్పటికీ సమాధానం ఇవ్వని వైనం

నెల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూసమస్యలు ఎంతలా పెరిగాయంటే.. ప్రజల సమస్యల్లో సగానికిపైగా అవే ఉంటున్నాయి. ప్రతీవారం జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సగానికి వరకూ అర్జీలు రెవెన్యూశాఖకు చెందినవే. అయితే వీటి పరిష్కారంలో మాత్రం ఆశించినంత పురోగతి లభించడం లేదు. గత ప్రభుత్వపు మత్తు ఇంకా వదలని కొందరు రెవెన్యూ సిబ్బంది.. తూతూమంత్రంగా అర్జీలను పరిశీలించి, సమస్య పరిష్కారం కాకుండానే అర్జీని క్లోజ్ చేస్తున్నారు. దీంతో బాధితులు మళ్లీ మళ్లీ అదే సమస్యతో కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

● కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ

ఈ పరిస్థితిని గమనించిన కలెక్టర్ ఓ ఆనంద్ రెవెన్యూ శాఖలో నిర్లక్ష్యాన్ని పోగొట్టేందుకు ఉపక్రమించారు. రీఓపెన్ అవుతున్న సమస్యలపై మొదటగా దృష్టిపెట్టిన ఆయన వాటిని పరిశీలించేందుకు కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సిబ్బందితో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశారు. వారు ఎప్పటికప్పుడు గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి సంబంధించిన విషయాలను కలెక్టర్ నోటీసుకు తీసుకెళుతున్నారు. ఈ క్రమంలోనే పరిష్కారమయ్యే సమస్యలను కూడా పరిష్కరించకుండా అర్జీదారులను ఇబ్బంది పెడుతున్న పలువురు తహసీల్దార్లపై చర్యలకు కలెక్టర్ ఆనంద్ పూనుకున్నారు. తొలి విడతగా 15 మంది తహసీల్దార్లకు నెల క్రితం మెమోలు జారీ చేశారు. ఎందుకు పలానా అర్జీ పరిష్కరించలేదో మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆ మెమోల్లో ఆదేశించారు. అయినా ఆ తహసీల్దార్లకు చీమకుట్టినట్లు కూడా లేదు. నెల గడిచినా పలువురు తహసీల్దార్ల నుంచి కలెక్టర్‌కు సమాధానాలు అందలే దు. కలెక్టర్ మెమోలను కూడా లెక్కచేయనంత స్థాయికి రెవెన్యూ సిబ్బంది వెళ్లారంటే ఆ శాఖలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కలెక్టర్ ఆదేశాలనే లెక్క చేయని వారు ఇక సామాన్యులకు ఎలా సమాధానం చెబుతున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కాగా ఈ నెల రోజుల్లో మరికొన్ని పరిష్కారం కాని అర్జీలు కూడా ఈ జాబితాలో చేరాయి. వీటికి సంబంధించి కూడా మరికొంతమంది తహసీల్దార్లకు మెమోలు సిద్ధమైనట్లు తెలుస్తోంది.



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్ ఆనంద్(ఫైల్)

● విచ్చలవిడిగా భూసమస్యలు

వైసీపీ ప్రభుత్వంలో భూసమస్యలు అధికమయ్యాయి. భూఆక్రమణలు, భూరికార్డులు మార్పు వంటి విచ్చలవిడిగా జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే భూసమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆ కోవలోనే గ్రామ సభలు నిర్వహించడం, ల్యాండ్ గ్రా బింగ్ చట్టం తీసుకురావడం జరిగింది. ప్రతి సోమ వారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవె న్స్)లో వచ్చే భూసమస్యలను కూడా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ప్రభుత్వం ఆదే శించింది. జూన్ 15వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ గ్రీవెన్స్‌లో 7970 అర్జీలు నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు చెందినవే 3738 అర్జీలు ఉండడం గమనార్హం. వీటిలో ఇప్పటి వరకూ 1809 అర్జీలను పరిష్కరించగా, 1739 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. మరో 190 అర్జీలు రీఓపెన్ అయ్యాయి. ఇంత భారీ స్థాయిలో మరే శాఖలోనూ అర్జీలు రీఓపెన్ అవ్వడం లేదు. రీఓపెన్ చేయని సమస్యలు కూడా పలుమార్లు అధికారుల వద్దకు వస్తున్నాయి. వీటిలో చాలా వరకూ పరిష్కరించగలిగిన సమస్యలే ఉంటున్నాయి. అయితే క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని ఉన్న తాధికారులు భావిస్తున్నారు. దీంతో రెవెన్యూ సిబ్బందిలో నిర్లక్ష్యం పోగొట్టే చర్యలకు కలెక్టర్ పూనుకున్నారు. ఆ క్రమంలోనే తహసీల్దా ర్లకు మెమోలు జారీ చేశారు. ఇదే పద్ధతి కొంతకాలం పాటు సాగితే రెవెన్యూ వ్యవస్థ గాడిలో పడుతుందన్నది ఉన్నతాధికారుల ఆలోచన. అయితే క్షేత్రస్థాయి సిబ్బందిలో మాత్రం చలనం ఉండడం లేదు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు మరింత కఠిన చర్యలకు ఉపక్రమిం చాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భర్త చేతిలో భార్య హత్య

● వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఘాతుకం

బిట్రగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో భార్యను భర్త హత్య చేశాడు. ఈ సంఘటన మంగళవారం బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు విశ్వనాథరావుపేటలో కాపురం ఉంటున్న జలచిత్ర దత్తు అలియాస్ దత్తాత్రేయకు మొదటి భార్య మృతి చెందడంతో తస్లీమా(35) అనే ఆమెను రెండో పెళ్లి చేసుకున్నాడు. మూడేళ్ల పాటు సజావుగా సాగిన వారి సంసారంలో మనస్పర్థల కారణంగా కలతలు మొదలయ్యాయి. ఈ క్రమంలో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో మంగళవారం ఉదయం ఆమెతో గొడవపడి దత్తు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం మద్యం సేవించి వచ్చి ఆమెతో గొడవపడి కత్తితో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడని కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కావలి డీఎస్పీ శ్రీధర్, రూరల్ సీఐ పాపారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. నిందితుడు దత్తు కోసం దగదర్తి, అల్లూరు ఎస్సైలు జంపానికుమార్, కిశోర్ తమ సిబ్బందితో కలసి గాలిస్తున్నట్లు ఎస్సై భోజ్యా తెలిపారు. పోస్టుమార్టం కోసం తస్లీమా మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



రక్తపు మడుగులో పడిఉన్న తస్లీమా మృతదేహం (ఇన్‌సర్ట్‌లో), తస్లీమా (ఫైల్)

సోషల్ మీడియాలో పోస్టింగులపై కేసులు

సోషల్ మీడియాలో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకరచిత్రాల పోస్టింగ్స్‌పై అందుతున్న ఫిర్యాదులపై జిల్లా పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. సోమవారం కావలి ఓ కేసు, మంగళవారం నెల్లూరు, సంగంలో ఒక్కొక్క కేసు నమోదు అయ్యాయి.

నెల్లూరు(క్రైం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేల ఫొటోలను మార్ఫింగ్ చేసి కొంతకాలంగా అసభ్యకరమైన మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తు న్న సత్యసాయి జిల్లాకి చెందిన బాలాజీరెడ్డిపై వేదాయపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తూ రాజకీయ వర్గాల మధ్య చిచ్చు పెడుతూ, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారంటూ వెంగళరావునగర్‌కి చెందిన షేక్ ముషీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎన్ బాలాజీరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● అన్నమయ్య జిల్లా వాసిపై సంగంలో కేసు

సంగం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కే పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేయడంపై నెల్లూరు జిల్లా సంగం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజామోహిద్దీన్ (బాబు) ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. త్వరలో నిందితుడ్ని అరెస్ట్ చేసి విచారిస్తామని ఆయన తెలిపారు.



జల జల పంచలింగాల

సోమశిల అటవీ ప్రాంతం పంచలింగాల కోనలో ప్రవహి స్తున్న జలపాతం భక్తులను కనువిందు చేస్తోంది. కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు అటవీ మార్గాన ఆ క్షేత్రానికి చేరుకుని జలపాతంలో పుణ్యస్నానాలు చేసి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)



వంతెనకు మరమ్మతులు మరిచారా ?

విడవలూరు మండలం పార్లపల్లి-చవట పాళెం మధ్య రహదారిపై ఉన్న వంతెన దెబ్బతిని నాలుగేళ్ల అవు తోంది. గత పాలకులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 2020లో వచ్చిన వరదలకు పంట కాలువపై ఉన్న వంతెన దెబ్బతింది. దీంతో పార్లపల్లికి, చవటపాళెనికి రాక పోకలు స్తంభించాయి. పాలకు లకు, అధికా రులకు మొరపెట్టు కున్నా ఇంతవరకు వంతెన ను మాత్రం బాగు చేయలేదని స్థానికులు పేర్కొన్నారు. దీంతో ప్రతి పనికి చవటపాళెం కాలనీవాసులు కొడవలూరు మీదుగా పార్లపల్లికి రాకపోకలు సాగిస్తున్నారు.

- విడవలూరు (ఆంధ్రజ్యోతి)

ఆయుష్షు తీరిన అంగన్‌వాడీ భవనం



కోవూరు మండలం గంగవరంలో ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరింది. అది ఎప్పుడు కూలుతుందోనని భయపడి, చిన్నారుల తలిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి తమ పిల్లలను పంపడం మానేశారు. దీంతో ఆ కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చారు. గంగవరం గ్రామ కూడలిలో ఏర్పాటుచేసిన ఈ కేంద్రంలో గతంలో యాభై మంది బాలలు చదువుకునేవారు. ఈ భవనాన్ని నేలమట్టం చేసి నూతన భవనం నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



మాయల పకీర్ వేష ధారణలో నారాయణ రావు

కళారాధనలో 'నారాయణుడు'

- నాటకాల్లో 'పెరమన' వివిధ పాత్రల పోషణ

ఆయనకు నాటకాలంటే ఎనలేని ప్రాణం.. ఎన్నో పౌరాణిక, సాంఘిక నాటకాల్లో నటించారు. అంతేకాక కళారాధకుడిగా, కళాపోషకుడిగా ఎన్నో నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. ఈ క్రమంలో వారసత్వంగా సంక్రమించిన అస్తిపాస్తులను హారతి కర్పూరం చేశారు. నేడు జీవనం కష్టమై పెద్దల నుంచి అబ్బిన ఆయుర్వే ద వైద్యాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఆయనే పెరమన నారాయణరావు.

- ప్రదర్శనలకే ఆస్తి మొత్తం హారతి కర్పూరం
- మంజూరు కాని కళాకారుల పింఛన్
- వంశపారంపర్య వైద్యమే నేడు జీవనాధారం

సంగం మండలం కొరిమెర్ల గ్రామానికి చెందిన పెరమన నారాయణరావు వెనుకబడిన వర్గానికి చెందినవారు. అయినా ఆయన కుటుంబానికి నాడు గ్రామంలో 33 ఎకరాల మాగాణి, 45 ఎకరాల మెట్ట, తోటలు, భూములు, నెల్లూరులో ఇల్లు, నివాశస్థలాలు, వందలాది గొర్రెలు, మేకలు ఉండేవి. ఈయన తరంలోకి వచ్చేటప్పటికి నాటకాల పిచ్చితో ఆస్తి అంతా హారతి కర్పూరం అయింది. చివరకు వంశపారంపర్యంగా అబ్బిన ఆయుర్వేద వైద్యమే నేడు జీవనాధారం అయింది.

● బాల్యం నుంచి నాటకాలంటే ప్రాణం

నారాయణరావు తాత రామయ్య తోలుబొమ్మలాటలో ఉపయోగించే తోలు బొమ్మలను తయారుచేసేవారు.నారాయణరావు తాత నుంచి కళావారసత్వాన్ని పొందారు. తన తొమ్మిదేళ్ల వయసులోనే తొలిసారిగా బాలనాగమ్మ నాటకంలో బాలవర్ధిగా నటించారు. ఇక ఇక్కడ నుంచి నారాయణరావు కళా ప్రస్థానం ప్రారంభమైంది. 1969లో సురభి కంపెనీలో ఆయన కళాకారుడిగా చేరారు. కొన్నేళ్లపాటు ఆ కంపెనీలో ఉంటూ తన కళా నైపుణ్యానికి మరింత మెరుగులు దిద్దుకొన్నారు. ఆ తరువాత కంపెనీ నుంచి బయటకు వచ్చి పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాల్లో పాత్రలు ధరించారు. నటుని గానే మాత్రమేకాక దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. నారాయణరావు బాలనాగమ్మ, తారాశశాంకం, సత్య హరిశ్చంద్ర, శ్రీకృష్ణరాయబారం, కురుక్షేత్రం, రామాంజనేయ యుద్ధం, మాయాబజార్ నాటకాల్లోని అన్ని పాత్రలను పోషించి రక్తి కట్టించేవారు.



పెరమన నారాయణరావు

● సాంఘిక నాటకాల్లో కూడా నటన

అంతేకాక అల్లూరుసీతారామ రాజు, బొబ్బిలియుద్ధం, పల్నాటి యుద్ధం వంటి చారిత్రక నేపథ్యం కలిగిన నాటకాలు, నిప్పురవ్వ, నీతికి స్థానమెక్కడ, కోడినాగు, పల్లెపడుచు, సూరీడు, ఊరమ్మడి బతుకులు వంటి 73 రకాల సాంఘిక నాటికాల్లో వివిధ పాత్రలు ధరించి ప్రేక్షకుల మెప్పించారు. బండారు రామారావు, రేబాల రమణ, డీవీ సుబ్బారావు, పున్నూరు సుబ్బారావు, ఏ కృష్ణారెడ్డి, పురిణి రఘు రామయ్య, కేవీ కోటేశ్వరరావు, గంగాధరరావు,కే రమణారెడ్డి, గూడూరు సావిత్రి, అర్జునాదేవి, వసంతశోభ, పీ లీలాదేవి వంటి ఉద్దండపిండాలతో కలసి నారాయణరావు పలు నాటకాలలో తన నటన కౌశల్యాన్ని ప్రదర్శించారు. ఇలా జీవితాన్నే నాటకరంగానికి అంకితం చేశారు.

● ఆస్తులన్నీ పోయాయి...

ఆయనకు 40 ఏళ్ల వచ్చేటప్పటికి కళాప్రస్థానంలో తాతలనాటి ఆస్తులు హారతి కర్పూరం అయ్యాయి. చివరకు నారాయణరావు తన భార్య బిడ్డలతో కలసి కొరిమెర్లలోని చిన్న రేకులింట్లో కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం ఆయనకు 65 ఏళ్లు. వంశపారంపర్యంగా అబ్బిన ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. ఆయనకు ముగ్గురు ఆడపిల్లలు . కళాకారుడిగా తనకు ప్రభుత్వం కాసింత భూమి ఇప్పిస్తే కుటుంబపోషణకు ఇబ్బందులుండవని పలు పర్యాయాలు అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఎవరూ కరుణించలేదు. స్థానిక రాజకీయాలవల్ల కళాకారుల పింఛన్ కూడా మంజూరుకాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు ఆదుకోవాలని నారాయణరావు కోరుతున్నారు.



బాలవర్ధి పాత్రలో నారాయణరావు

- సంగం, (ఆంధ్రజ్యోతి)



నెల్లూరు వీఆర్సీ కూడలిలో నిలిచిన వర్షపు



అప్పయ్యకండ్రికలో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న గడ్డివాము



కురిచెర్లపాడు సమీపంలో కల్వర్టు కుంగడంతో తెగిపోయిన రోడ్డు

జోరువాన

(5వ పేజీ తరువాయి)

అంతర్గతరోడ్డు మార్గంలో మంగళవారం కల్వర్టు కుంగిపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

● విద్యుత్ అంతరాయం

కోవూరు, (ఆంధ్రజ్యోతి): మంగళవారం కోవూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు విద్యుత్ సరఫరా నిలచిపోయింది. కోవూరులోని ఎన్ఎస్ఆర్ నగర్, పీఆర్ఆర్ కాలనీ, గుమ్మళ్ళదిబ్బల్లోని ప్రధాన వీధుల్లో వర్షపునీరు నిలచిపోయాయి.

రాకపోకలకు ఇక్కట్లు

కావలి, (ఆంధ్రజ్యోతి)వర్షంవస్తే కావలి అన్నపుగుంట మార్గంలో రాకపోకలకు ప్రజలతోపాటు విద్యార్థులకు అవస్థలు తప్పటంలేదు. వర్షం పడితే అన్నపుగుంట నీరంతా ఆ వంతెన ద్వారా వరవకాలువలోకి వెళ్లాల్సి ఉంది. ఆ మార్గంలో వర్షపు నీటితో రాక పోకలు స్తంభించాయి. సైకిళ్ల ఉన్నవారు మోకాటి లోతు నీళ్లలోనే ఇద్దరు ముగ్గురు కలిసి సైకిళ్ల నెట్టుకుని వెళ్లగా, సైకిళ్ల లేనివారు ప్రమాదపుటంచున రైల్వేట్రాక్ ఎక్కి దాటుకుని వెళ్లారు.

● చెరువులకు జలకళ

బుచ్చిరెడ్డిపాళెం, (ఆంధ్రజ్యోతి): కుండపోతగా వర్షానికి మండలంలోని చెరువులు, పొలాలు, గుంటలు, కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. రైతులు వరినాట్ల కోసం దుక్కులు చేసుకుంటున్నారు

● ముత్తుకూరులో ఆగని వర్షం

ముత్తుకూరు, (ఆంధ్రజ్యోతి) : మంగళవారం ముత్తుకూరులో జోరుగా వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడడంతో ముత్తుకూరులో విద్యుత్ సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడింది.

● వరికయ్యల్లో నిలిచిన నీరు

జలదంకి, (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయాన్నే రైతులు వ్యవసాయపనుల కోసం పొలాల్లోకి పరుగులు తీశారు. రైతులు నారుమళ్లకు ఎరువులు చల్లుతూ, క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నారు.

● ఎగసిపడుతున్న అలలు

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. దీంతో ప్రభుత్వాసుపత్రి వర్షపునీటితో నిండిపోయింది.అలాగే సముద్రంలో అలలు ఎగసి పడుతూ ఉన్నాయి. దీంతో మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లేందుకు సాహసించలేదు.

● రైతుల హర్షం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి సరిపడినంత సాగునీరు లేవని బాదపడుతున్న వారికి ఈ వానలు ఊరట కలిగించాయి.

● వీధులు జలమయం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులన్నీ సరిగా లేకపోవడం, డ్రైనేజీలు పూడిపోయి ఉండటంతో కురుస్తున్న వర్షాలకు వీధులన్నీ జలమయమయ్యాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వర్షపునీరు పోయే మార్గాలను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● అప్పయ్యకండ్రికలో పిడుగుపాటు

నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పయ్యకండ్రికలో సోమవారం అర్ధరాత్రి పిగుడుపడింది. దీంతో బడుగు వెంకటేశ్వర్లుకు చెందిన 15 ఎకరాల వరిగడ్డివామి దగ్ధమైంది.

● పొగాకుకు జీవం పోసిన వర్షం

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం కురిసిన వర్షం పొగాకు పంటకు జీవం పోసింది. ఎండుముఖం పట్టిన పొగాకు వర్షానికి కళకళలాడుతున్నాయి.



కొత్తసత్రంలో పిడుగుపాటుకు 11 గొర్రెల మృతి

- నాలుగు జీవాలకు గాయాలు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంపీడీవో

కావలి రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రంలో మంగళవారం పిడుగుపాటుకు గురై 11 జీవాలు(గొర్రెలు) మృతి చెందగా, 4 జీవాలు గాయపడ్డాయి. గ్రామస్థుల కథనం మేరకు, గ్రామానికి సమీపంలోని పొలాల్లో నక్కా శ్రీకాంత్ జీవాలు మేపుతుండగా వర్షం పడుతుండటంతో కొన్ని జీవాలు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లాయి. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగుపడింది. చెట్టుకు కొంతదూరంలో ఉన్న శ్రీకాంత్ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. ఈ ప్రమాదంలో 11 గొర్రెలు చనిపోగా, నాలుగు గొర్రెలు గాయప డ్డాయి. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నరేంద్ర ప్రమాద విషయాన్ని ఎంపీడీవో శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె సంఘటనా స్థలంలో పడిఉన్న జీవాల మృతదేహాలను పరిశీలించి పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. జీవాల మృతితో రూ. 2.5 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకుని పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.



అడ్డుకట్ట పడేనా ?

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ముమ్మరంగా వ్యవసాయ పనులు సాగుతున్నాయి. ఓ వైపు మిరపనాట్లు పూర్తయి ఎరువులు ఎదబెడతుండగా, పొగాకు, పప్పుశనగ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు ఎరువులు ఎదబెట్టి భూములను సిద్ధం చేస్తున్నారు. ఈ దశలో ఎరువుల కొరత వారిని తీవ్రంగా వేధిస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఎరువుల కొరత లేకుండా చేస్తారని ఆశించిన రైతులకు తీవ్రనిరాశే మిగిలింది. జిల్లా వ్యాప్తంగా రూ.కోట్లు రైతుల కష్టం వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● పీఏసీఎస్‌ల్లో మొక్కుబడిగానే..

ఎరువుల సరఫరాలో ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) ద్వారా రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు నెల క్రితం అధికారులు ప్రకటించారు. అయితే ఆచరణలో మాత్రం చేతులెత్తేశారు. కందుకూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఐదు మండలాల్లో 14 పీఏసీఎస్‌ల ద్వారా ఎమ్మార్పీకే ఎరువులు అందుబాటులో ఉంచనున్నామని, రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సిన అవసరం రాదని అధికారులు ప్రకటిం చారు. ఈ మేరకు ఆగస్టు చివరి, సెప్టెంబరు మొదటి వారంలో ఆయా పీఏసీఎస్‌లకు ఎరువుల లైసెన్సులు కూడా మంజూరు చేశారు. అయితే రెండునెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క పీఏసీఎస్‌లో కూడా ఎరువుల విక్రయాలు ప్రారంభం కాలేదు. జిల్లావ్యాప్తంగా వందకుపైగా ఏపీఏసీల ద్వారా ఎరువుల విక్రయాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధికారులు ప్రకటిం చినా ఆచరణలో కార్యరూ పం దాల్చలేదు. బడేవారిపాలెం పీఏసీఎస్‌లో మాత్రమే రైతులకు ఎరువులు అందిస్తుండగా, మిగిలిన 13 పీఏసీఎస్‌ల్లో ఆ ప్రయత్నమే జరగలేదు. దీంతో రైతుల అవసరాన్ని ప్రైవేటు డీలర్లు సొమ్ముచేసు కుంటున్నారు.

● రైతు సేవా కేంద్రాల సేవలు ఏవీ?

గ్రామ గ్రామాన రైతు సేవాకేంద్రాలతోపాటు ఎరువుల గోదాములు కూడా ఉన్నాయి. ఈ కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచితే రైతులకు మేలు జరగడంతోపాటు ధరలు కూడా నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంది. అయితే పీఏసీఎస్‌ల పేరుతో కాలయాపన చేస్తుండటంపై రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు రైతు సేవా కేంద్రాలలోనో ఇటు పీఏసీఎస్‌లలోనూ ఎరువులను అందుబాటులోకి తీసుకురాకుండా ప్రైవేటు వ్యాపారులకే వదిలేయడంపై మతలబు ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

● ఆదేశాలన్నీ కాగితాల్లోనే..

ఎరువుల ధరల నియంత్రణకు, రైతులకు అందుబాటులో ఉండేలా చూడటం కోసం ప్రతి సబ్ డివిజన్‌కు ఓ ప్రత్యేక అధికారిని వ్యవసాయ శాఖ నియమించింది. కందుకూరు సబ్ డివిజన్‌కు ఎరువుల విజిలెన్స్ అధికారిగా కావలి ఏడీఏని నియమించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా విజిలెన్స్ విభాగాన్ని ఏర్పాటుచేయటంతోపాటు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏ స్థాయి అధికారి పర్యవేక్షణలో ఎరువుల సరఫరా కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితం కావటంతో రైతులకు ఏమాత్రం మేలుజరగడం లేదు. జిల్లా కలెక్టరు, ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను అధ్య యనం చేసి, ఇటు రైతు సేవాకేంద్రాల ద్వారా కానీ అటు పీఏసీఎస్‌ల ద్వారా కానీ రైతులకు అన్నీ రకాల ఎరువులు ఎమ్మార్పీకే లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భగ్గుమంటున్న ధరలు

యూరియా 45 కిలోల బస్తా రూ. 266లకు రైతులకు అందజేయాల్సి ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ. 350 నుంచి రూ. 380 వరకు వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో రూ.350కి విక్రయిస్తుండగా, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా ఛార్జీలు, ఇతరత్రా పేరుతో రూ. 380 వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. దీంతో సరాసరిన రైతులు బస్తా యూరియాకు రూ. 100 అదనంగా చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే డీఏపీ 50 కిలోల బస్తా రూ. 1350కి విక్రయించాల్సి ఉండగా, రూ. 1450 నుంచి రూ. 1480 వరకు వసూలు చేస్తున్నారు. రైతులు ఇష్టపడే గోదావరి డీఏపీ కావాలంటే రూ. 1530 చెల్లిస్తేనే ఆ రకం డీఏపీని ప్రైవేటు వ్యాపారులు రైతులకు ఇస్తున్నారు. ఏ కంపెనీ డీఏపీ అయినా ఒకే ధరకు విక్రయించాల్సి ఉన్నా రైతులు కోరుకునే డీఏపీ కాబట్టి గోదావరి డీఏపీకి మరింత ధర వసూలు చేస్తున్నారు. పోనీ సొసైటీల్లో తీసుకుందామా అంటే ఒక్క బడేవారిపాలెం సొసైటీలో మినహా ఎక్కడా అందుబాటులో లేవు. అక్కడ కూడా లారీ వస్తే గంటలోపే అయిపోతుండటంతో రైతులకు సక్రమంగా అందటం లేదు. ఇక మిగిలిన కాంప్లెక్స్ ఎరువులు కొంతవరకు అందుబాటు ధరలోనే లభ్యమవుతున్నట్లు సమాచారం.



శిథిలావస్థలో చరిత్ర చిహ్నం

సుమారు 140 సంవత్సరాల కిందట బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఇరిగేషన్ శాఖ అతిథి భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా సంగం - నెల్లూరు రహదారి పక్కనే ఈ భవనం ఉంది. దీన్ని 1882 సంవత్సరంలో బ్రిటీష్ అధికారులు నిర్మించారు. సంగం వద్ద పెన్నానదిలో బ్యారేజి నిర్మాణ సమయంలో అధికారులతోపాటు, ఇంజనీరింగ్ అధికారుల విశ్రాంతి కోసం నిర్మించిన చరిత్రకు చిహ్నంగా ఉన్న ఈ భవనానికి మరమ్మతులు చేసేందుకు స్థానిక అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరుచేసి మరమ్మతులు గానీ, నూతన భవనం గానీ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- సంగం (ఆంధ్రజ్యోతి)

వేదగిరిపై అకల్మష హోమం

వేదగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం అకల్మష హోమం, శాలవాస్తు హోమం నిర్వహించారు. స్వామి, అమ్మవారి నిత్యం పూజలు, కైంకర్యాల్లో దోషాల నివృత్తికి ఈ పవిత్రోత్సవాలు వైఖానస ఆగమ విద్వాన్ డాక్టర్ పీ సత్యనారాయణ చార్యుల నేతృత్వంలో జరుగుతున్నాయి. ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆయన బృందంతో కలిసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, రక్షాబంధన పూజలు నిర్వహించారు. అనంతరం విశేష తిరుమంజనం నిర్వహించారు.

- నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)



నిబంధనలు పాటించకుంటే కేసులు

● ఎక్సైజ్ అధికారులకు డీసీ ఆదేశాలు

నెల్లూరు(క్రైం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బార్లు, వైన్ షాపుల యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ బెల్ట్ షాపులపై దాడులు చేస్తూ కేసులు నమోదు చేయాలని, సమయపాలన పాటించని వైన్ షాపులపై చర్యలు తీసుకోవాలని, బ్రాండ్ మిక్సింగ్ చేయకుండా హెచ్చరికలు చేయాలని సూచించారు. సారా తయారీ, అమ్మకాలు, రవాణాను నిర్మూలించాలన్నారు. గంజాయి అమ్మకాలు, రవాణాను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ దయాసాగర్, ఈఎస్ శ్రీనివాసనాయుడు, ఏఈఎస్‌లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



డీసీని సత్కరిస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు

అధికారులకు సత్కారం

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో జిల్లాలో కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందిన వారు మంగళవారం జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా డీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది క్రమశిక్షణతో ఉంటూ నిజాయితీగా విధులు నిర్వహించాలని సూచించారు.

విద్యుత్ పథకంపై అవగాహన కల్పించండి

● ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉర్జావీర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ సూచించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్ స్కాడా కార్యాలయంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు పథకంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్ఈ మాట్లాడుతూ రాష్ట్రంలో దీనిని సీఎం చంద్రబాబు నాయుడు ఈనెల 22న వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుంటే విద్యుత్ బిల్లు 15 నుంచి 25 శాతం ఆదా అవుతుందని తెలిపారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు, 1.5 టన్నుల సామర్థ్యం ఉన్న ఏసీలు, స్టౌలు, ఇన్వర్టర్లను ఈ పథకం ద్వారా అందజేస్తారని చెప్పారు.. ఈ కార్యక్రమంలో ఈఈలు శేషాద్రి బాల చంద్ర, శ్రీధర్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి పెద్ద పీట : రఘురాం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ చెప్పారు. మంగళవారం నెల్లూరులోని కిలారి తిరుపతినాయుడు కల్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.39,007 కోట్లు కేటాయించటం శుభపరిణామమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమై పోయిన బీసీ కార్పొరేషన్లకు కూటమి ప్రభుత్వంలో జవసత్వాలు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు గంపల అనిల్‌కుమార్, నాయకులు గేద్దేటి చెంచయ్య, కనకట్ల గోపాలయ్య, వెడిచర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుల గణన చేయకపోతే తడాఖా చూపిస్తాం

● బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు

నెల్లూరు (సాంస్కృతికం) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కుల గణన చేయకపోతే బీసీల తడాఖా చూపిస్తామని బీఎస్పీ ఏపీ కోఆర్డినేటర్ డాక్టర్ బుజ్జవరపు పూర్ణచంద్రరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్‌లో బీసీల ధర్నా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కీలక పదవులను రెడ్లు, కమ్మలకే కట్టబెడుతు న్నారన్నారు. బీసీలు నామినేటెడ్ పదవులకు అర్హులుకారా అని ప్రశ్నించారు. ఈ సభలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్క పరంజ్యోతి, రాష్ట్ర బీసీ సంఘం నాయకులు ఏ పూర్ణచంద్రరావు, కన్వీనర్ బీసీ రమణ, అధికార ప్రతినిధులు గోవిందు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మనుబోలు ఏఎస్ఐకి గాయాలు

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మనుబోలు ఏఎస్ఐకి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న షేక్ జిలానీ నెల్లూరుకు వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ఈప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఒక ప్రైవేటు అసుపత్రికి తరలించారు. మంగళవారం ఏఎస్ఐ కుమారుడు షేక్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైకు బోల్తాపడి డీడీవోకి గాయాలు

వరికుంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మోటారుబైకు అదుపుతప్పి బోల్తా పడడంతో డీడీవో ప్రభుదాసు గాయాలపాలైన సంఘటన మంగళ వారం కోటవర్ధినిపల్లి గ్రామ సమీపంలో చోటుచేసు కుంది. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల విరువూరు గ్రామ సచివాలయ ఇన్‌చార్జి డీడీవోగా బాధ్యతలు చేపట్టిన ప్రభుదాసు స్వగ్రామమైన ఉదయగిరి నుంచి మోటారుబైకుపై సచివాలయానికి వెళ్తుండగా ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను గమనించకపోవడంతో మోటారుబైకు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఆయన రహదిరిపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న సచివాలయ ఉద్యోగులు అక్కడికి చేరుకొని ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించారు.

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు, జరిమానా

నెల్లూరు, (లీగల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికను ప్రేమించా నని నమ్మించి అమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో కాపూరు మస్తాన్ బాబు అనే నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.23వేల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేర కు... చిల్లకూరు మండలం బూదనం గ్రామానికి చెందిన కాపూరు మస్తాన్ బాబు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలికను ప్రేమించానని నమ్మించి 2021 ఫిబ్రవరి 18న లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక బంధువుల ఫిర్యాదుతో చిల్లకూరు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.7235
వెండి కిలో ధర	రూ. 90,700
వెండి ఒక గ్రాము	రూ.93.70

నెల్లూరు నగరంలోని రైస్‌మిల్లుల తరలింపు వ్యవహారం చర్చల దశకు రావటం, కోటాది రూపాయల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలు చేతికందక పోవటంతో రైసుమిల్లర్లు సతమతమవుతున్నారు. ప్రభుత్వం అన్నీ మౌలిక వసతుల తో కొత్త స్థలాలను చూపి, బ్యాంకు రుణాలిప్పిస్తే కొత్తగా మిల్లులు నిర్మించే వారు ఆ స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటారని, క్రమంగా ప్రస్తుత మిల్లులను కూడా అక్కడికి తరలించే అవకాశం ఉంటుందని తెలిపారు.



అల్లీపురం రోడ్డు ప్రాంతంలో రైస్‌మిల్లు

మిల్లుల తరలింపు..

మిల్లింగ్ బకాయిలు

- తరలింపునకు భారీ వ్యయం
- రూ.60 కోట్లు 'సీఎంఆర్' పెండింగ్
- రైస్‌మిల్లర్ల సతమతం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరానికి సమీపంలోని అల్లీపురం రోడ్డు, రాజుపాళెం ప్రాంతాల్లో రైస్ మిల్లులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి. నగరం విస్తరించడం, జనాభా పెరగడంతో ఆ రైస్ మిల్లులు నగర నడిబొడ్డుకు చేరు కున్నాయి. వాటి నుంచి వెలువడే కాలుష్యం వల్ల ప్రజలకు నష్టం వాటిల్లకూడదని మంత్రులు, అధికారులు భావించారు. మిల్లులను కృష్ణపట్నం పోర్టు ప్రాంతానికి గానీ, ఇఫ్కో కిసాన్ సెజ్‌కుగానీ తరలించాలను కున్నారు. మిల్లర్లు, మిల్లర్ల సంఘ నాయకులతో సామరస్య చర్చల అనంతరం తరలింపు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే ఇటీవల మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి అధికారులతో సమీక్షించారు. రైస్ మిల్లుల తరలింపునకు పూనుకుంటామని ప్రకటించారు. అనంతరం మిల్లర్ల సంఘాల నాయకులతో జేసీ కార్తీక్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మిల్లర్ల సంఘాల నాయకులు సమస్యలను ఏకరువు పెట్టారు. కోట్ల రూపాయల విలువైన యంత్ర పరికరాలు దెబ్బతింటాయని, ఇతర పరిశ్రమలతో పోల్చితే రైస్ మిల్లుల కాలుష్యం పెద్ద ఎక్కువేంకాదంటూ తరలింపునకు విముఖత వ్యక్తం చేశారు.

కమిటీ ఏర్పాటు చేయాలి



తమిళనాడులోని రెడ్‌హిల్స్‌లో వందలాది రైస్‌మిల్లులు ఉన్నాయి. వాటి నుంచి వచ్చే కాలుష్య నియంత్రణకు అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లా నుంచి అధికారులు, మిల్లర్ల సంఘాల నాయకులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి రెడ్‌హిల్స్‌కు పంపి పరిశీలన జరిపించాలని, ఆ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలి. రూ.60 కోట్ల సీఎంఆర్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించి మిల్లర్లను ఆదుకోవాలి.

- నాగిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ది నెల్లూరు రైస్‌మిల్లర్స్ అండ్ డీలర్స్ అసోసియేషన్

రూ.కోట్లలో అప్పులు :

రైస్ మిల్లుల వారు కోట్లాది రూపాయలు అప్పు తెచ్చి ప్రభుత్వ నిబంధన లు, సూచనల ప్రకారం మిల్లుల నిర్మాణంతోపాటు వాటిలో అత్యాధునిక యంత్రాలను బిగించారు. ఒక్కొక్క మిల్లు యజమాని రూ.10 కోట్ల నుంచి రూ. 20 కోట్ల వరకు బ్యాంకుల నుంచి అప్పు తీసుకున్నట్లు సమాచారం.

సీఎంఆర్ బకాయిలు రూ. కోట్లలో :

జిల్లాలోని రైస్ మిల్లర్లకు గత ప్రభుత్వం సీఎంఆర్ బియ్యానికి సంబంధిం చి రూ.60 కోట్ల వరకు చెల్లింపులు చేయాలని సమాచారం. వాటి కోసం మిల్లర్లు ఎదురుచూస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం ఆడించడానికి, మిల్లులకు తోలడానికి రైస్ మిల్లులు రైతులకు అనుకూలమైన ప్రాంతాల్లో ఉండాలని చెబుతున్నారు. తమిళనాడులోని రెడ్‌హిల్స్ ప్రాంతంతో వందలాది రైస్‌మిల్లులు ఉన్నాయని, వాటి నుంచి కాలుష్యం బయటకు రాకుండా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇక్కడా అలాంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలుపాలి

● సాగునీటి సంఘాల ఎన్నికలపై కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), : సాగునీటి సంఘాల ఎన్నికల కోసం ఓటర్ల జాబితాను తహసీల్దార్ కార్యాలయాల్లో ఈనెల 10న ప్రచురించామని, అభ్యంతరాలుంటే తెలుపాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలను ఫామ్-ఈ, పేరు నమోదు కోసం ఫామ్-ఎఫ్, ఓటరు జాబితాలోని పేరుపై అభ్యంతరాలు తెలుపడానికి ఫామ్-జీ, పేరు తొలగించడానికి ఫామ్-హెచ్ ద్వారా తహసీల్దారు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తుది ఓటర్ల జాబితాను బుధవారం ప్రకటిస్తామని తెలిపారు.

కేంద్ర కారాగారంలో 19న పశువుల వేలం

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కేంద్ర కారాగార ఆవరణలో ఈ నెల 19వ తేదీన పశువులను వేలం వేయనున్నట్లు కారాగార పర్యవేక్షణ అధికారి ఎస్ రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 8 మగ ఆవు దూడలు, 6 మగ బర్రె దూడలు, ఒక బర్రెను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నామని తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు రూ.10 వేలు ధరావతు చెల్లించాలని, పూర్తి వివరాలకు 9000990587, 9440560894 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

వీఎస్‌యూని సందర్శించిన నిపుణుల కమిటీ

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీని మంగళవారం నిపుణుల కమిటీ సందర్శించింది. వీఎస్‌యూ నాణ్యత ర్యాంకింగ్‌ను మెరుగుపరచడం కోసం నిపుణుల కమిటీని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసింది. ఈక్రమంలో వీఎస్‌యూకు విచ్చేసిన కమిటీకి వర్శిటీలో జరుగుతున్న పరిశోధనలు, ప్రాజెక్టులు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాలు వంటి వివిధ అంశాలను వీసీ డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌రావు వివరించారు. ఆయన మాట్లాడుతూ నిపుణుల కమిటీ సభ్యులు యూనివర్శిటీ స్థితిని సమీక్షించి 2027 నాటికి ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో వర్శిటీ 100 ర్యాంక్‌లోకి చేరే వ్యూహాలను రూపొందించడానికి సిఫార్సులు అందించేందుకే ఈ కమిటీని నియమించారన్నారు. కార్యక్రమంలో నిపుణుల కమిటీ సభ్యులు డాక్టర్ రాజశేఖర్, పీజూష్ కాంతి పాణిగ్రహి, సంజయ్ ధోలే, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్ తదితరులున్నారు.



వీసీ డాక్టర్ విజయభాస్కర్‌రావుతో సమీక్షిస్తున్న నిపుణుల కమిటీ సభ్యులు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి జిల్లా జట్టు

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్-19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లాల జట్లు ప్రథమ స్థానాన్ని దక్కించుకుని విజేతలుగా నిలిచాయి. విజేత జట్లకు అధికారులు ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు డిప్యూటీ డీఈవో కె గోపాల్, ఆర్ఐపీఈ షేక్ మహబూబ్‌బాషా, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనంతలక్ష్మీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య, పీడీలు ఎన్ ప్రభాకరరెడ్డి, పి థామస్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలకు

113 మంది గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలకుఉ 113 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీ క్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో మొత్తం 826 మంది విద్యార్థులకు గాను 713 మంది హాజరయ్యారు.

రేపు మనుబోలుకు

ఐఏఎస్‌ల బృందం రాక

మనుబోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐదుగురు ఐఏఎస్‌ల బృందం గురువారం మనుబోలులో పర్యటించనున్నట్లు నెల్లూరు డీఎల్‌పీవో రమణయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ల బృందం పర్యటనపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ 14న ఉదయం 9గంటలకు మనుబోలుకు వచ్చి గ్రామపరిపాలన, రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయి పరిశీలన, కాలనీలో వసతులు, వారి స్థితిగతులు, జీవనవిధానం తదితర అంశాలపై పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, ఈవోపీఆర్‌డీ నారాయణ, కార్యదర్శి గరుడయ్య, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చట్టాలపై అవగాహన

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం జిల్లా రిజిస్ట్రార్ హరివర్మ నేతృత్వంలో రిజిస్ట్రేషన్‌శాఖ చట్టాలపై జూనియర్ జడ్జీలకు అవగాహన శిబిరం జరిగింది. ఇండియన్ రిజిస్ట్రేషన్ యాక్టు, ఇండియన్ స్టాంపు యాక్టు, సొసైటీ రిజిస్ట్రేషన్ తదితర అంశాలను న్యాయాధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు, నాయుడుపేట, కోట కోర్టులలో జూనియర్ జడ్జీలుగా ఇటీవల నియమితులైనవారు తదితరులు పాల్గొన్నారు.

కండలేరు పనుల్లో కదలిక

బడ్జెట్‌లో ఆశాజనకంగా నిధుల కేటాయింపు

కలువాయి, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): తెలుగుగంగ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో సోమశిల కం డలేరు కాలువ విస్తరణ పనుల్లో రెండేళ్ల తరువాత మళ్లీ కదలిక రానుంది. గత ప్రభుత్వం రెండేళ్ల నుంచి పెండింగ్‌లో ఉంచిన రూ.70కోట్ల బిల్లులను కూడా వారం క్రితం కూటమి ప్రభు త్వం క్లియర్ చేయడంతో ఈ పనులు మరింత ఊపందుకోనున్నాయి.



సోమశిల - కండలేరు వరద ప్రవాహపు కాలువ

కాలువ సామర్థ్యం 24వేల క్యూసెక్కులకు పెంపు

సోమశిల కండలేరు కాలువ సామర్థ్యం 12వేల క్యూసెక్కులు. సోమశిలకు వరద వస్తే ఈ కాలువ ద్వారా కండలేరు జలాశయం పూర్తి సామర్థ్యం 68టీఎంసీలు తరలించేందుకు మూడు నెలలు సమయం పడుతుంది. దీంతో ఈ కాలువ సామర్థ్యం 12వేల క్యూసెక్కుల నుంచి 24వేల క్యూసెక్కులకు రెట్టింపు చేస్తే నెల రోజుల్లోనే సోమశిల నుంచి కండలేరుకు 68టీఎంసీలు తరలించవచ్చు.

సోమశిలకు వరద ప్రవాహం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 5,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 68.377 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,150, కండలేరుకు తెలుగుగంగ ద్వారా 2600, ఉత్తర కాలువకు 700, దక్షిణ కాలువకు 700 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పలు కార్పొరేషన్లకు సభ్యుల ఎన్నిక

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు సభ్యులను మంగళవారం ప్రభుత్వం ప్రకటించింది. ఆర్యవైశ్య కార్పొరేషన్ సభ్యుడిగా నెల్లూరు నగరానికి చెందిన జనసేన నాయకుడు దుగ్గిశెట్టి అజయ్‌బాబు, కావలికి చెందిన టీడీపీ నేత తాటిపర్తి శ్రీనివాసులు ను ఎంపిక చేసింది. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు నెల్లూరు సిటీకి చెందిన కంచి జ్ఞానేంద్ర పేరు ప్రకటించింది.

బస్‌షెల్టర్‌లో అసాంఘికాలకు పాల్పడితే చర్యలు

● పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి జెండా సెంటర్‌లో ఉన్న బస్‌షెల్టర్‌లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెనుబల్లి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరమ్మ హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'బస్టాండే బారు' పేరుతో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికా రులు స్పందించారు. ఈ మేరకు బస్‌షెల్టర్ ముందు పెట్టిన టేబుల్, ఖాళీ కూల్ డ్రింక్ సీసాలను దుకాణాదారుడే స్వచ్ఛందం గా తొలగించారు. బస్‌షెల్టర్‌కు హెచ్చరిక నోటీసులు అంటించారు. బస్ షెల్టర్‌లోకి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.



పెనుబల్లిలో బస్‌షెల్టర్‌కు నోటీసులు అంటిస్తున్న సెక్రటరీ, సచివాలయ సిబ్బంది

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

● అడిషనల్ డీఎంహెచ్‌వో

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలీ సూచించారు. మంగళవారం గండిపాళెం, దుత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలన్నారు. గళ్ల పరీక్ష నమూనాలు తీసి ల్యాబ్‌కు పంపాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు సకాలంలో మందులు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, అయూబ్, సీహెచ్‌వోలు శివకుమారి, ఓంకారయ్య, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు భోగ్యం వెంకటేశ్వర్లు, ఖాజామొహిద్దీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ

కేన్సర్ సర్వేపై అవగాహన

● సీతారామపురం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో మంగళవారం కేన్సర్ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కావలి అడిషనల్ డీఎంహెచ్‌వో షేక్ ఖాదర్‌వలి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌సీ కేన్సర్ స్ర్కీనింగ్ ఇంటింటి సర్వే మొదలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, సూపర్‌వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పిఎస్, హెల్త్ అసిస్టెంట్స్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరునెలల్లో ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పూర్తి

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఆనకట్ట ఆధునికీకరణ పనులు ఆరు నెలల్లో పూర్తిచేయనున్నట్లు ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఆనకట్ట ఆధునికీకరణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కె.చంద్రమౌళి, ఏఈలు వేణు, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఆస్తులు ఆక్రమిస్తే చర్యలు

ఉదయగిరి రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖకు సంబంధించిన ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ ఎన్ వెంకటరావు, ఎస్‌ఐ కె ఇంద్రసేనారెడ్డిలు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని దిలావర్‌భాయ్‌వీధిలో గల పాత పోలీసు క్వార్టర్స్‌ను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్వార్టర్స్ స్థలాన్ని ఎవరైనా ఆక్రమించి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు రమణయ్యకు నేతల నివాళి

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 12, (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్, సీనియర్ నాయకుడు తాళ్లూరు రమణయ్యనాయుడు పార్థివదేహాన్ని మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, వైసీపీ జిల్లా నేత ఆనం విజయకుమార్‌రెడ్డిలు వేర్వేరుగా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట తడకలూరు, కాట్రాయిపాడు, చవటపుత్తేడు, చెన్నూరు సర్పంచులు గిరినాయుడు, ప్రసాద్, శీనయ్య, నాయక్ ఉన్నారు.


ఆర్‌ఎస్‌ఆర్‌లో న్యూస్ లెటర్ ప్రారంభం

బిట్రగుంట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్‌ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈ ఎక్స్పీరియా పేరుతో న్యూస్ లెటర్‌ను మంగళవారం ప్రిన్సిపాల్ పీవీఎస్ రెడ్డి ప్రారంభించారు.

శుభ్రతకు నోచుకోని ఓవర్‌హెడ్ ట్యాంకులు

● పల్లెలకు అందని రక్షితనీరు ● పొంచి ఉన్న వ్యాధులు

ఆత్మకూరు, నవంబరు 12: ఇటీవల వర్షాలు కురిసి తాగునీరు కలుషితం కావడం, ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోకపోవడంతో వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను కేవలం ఐదారు గ్రామాల్లో మాత్రమే నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నిధుల కొరత వెంటాడుతుండంతో పాటు పలు చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులకు నిచ్చెనలు లేకపోవడంతో శుభ్రతకు నోచుకోవడం లేదు. నెలలో రెండు సార్లు ట్యాంకులు శుభ్రం చేయాల్సి ఉంది. బ్లీచింగ్, సున్నంతో శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలి. మైనర్ పంచాయతీల్లో ఒక్కొక్క ట్యాంకును ఒక్కసారి శుభ్రం చేసేందుకు రూ.500 నుంచి రూ.1000, మేజర్ పంచాయతీల్లో రూ.1000 నుంచి రూ.1500 వరకు ఖర్చు చేస్తున్నట్లు లెక్కల ద్వారా తేటతెల్లమవుతోంది. అయితే నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, సంగం, మర్రిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో తాగునీటి వాటర్ ట్యాంకులు శుభ్రతకు నోచుకోవడం లేదు. దాంతో కలుషితనీరు సరఫరా కావడంతో పలు రోగాలు ప్రబలుతున్నాయని, ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వాటర్ ట్యాంకుల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.




శుభ్రతకు నోచుకోని వాటర్‌ట్యాంకు

గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామపంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్య దర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, అధికారులకు మండల, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ మాట్లాడుతూ పంచాయతీ ఆర్థిక వనరుల్లో ముఖ్యంగా 15వ ఆర్థికసంఘ నిధులను నిబంధనల మేరకు పారిశుధ్యం, తాగునీరు, ఇతర అవసరాలకు వినియోగించాలని తెలిపారు. అనంతరం ఈవోపీఆర్డీ వి డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు ఎస్ కార్తీక్, చిన్నమస్తాన్, డిజిటల్ అసిస్టెంట్ కె వేణు టీవీటీలుగా వ్యవహరించి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసులు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

●ఉదయగిరి రూరల్: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం గ్రామ పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళికలపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ మాట్లాడుతూ మండలంలోని 17 పంచాయతీల అభివృద్ధికి తీసు కోవాల్సిన ప్రణాళికలపై ప్రజాప్రతి నిధులకు శిక్షణ ఇవ్వడం జరిగింద న్నారు. తొలుత మహాత్మాగాంధీ, బీ ఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, సర్పంచులు సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, పావులూరి సామ్రాజ్యం, వెంకటస్వామి, తిరుపతయ్య, ఎంపీటీసీలు పెదమస్తానీ, కాకు విజయమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● కొండాపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కార్యదర్శులు, సర్పంచులకు ఎంపీడీవో ఆదినారయణరావు సూచించారు. మంగళవారం ఆయన సాయిపేట, భీమవరప్పాడు, నేకునాంపేట, రేణమాల, పార్లపల్లి, సత్యవోలు, కొమ్మి, గానుగపెంట, శెట్టిపాలెం సర్పంచులతో సమావేశం అయ్యారు. సీసీరోడ్లు, వీధిలైట్లు, డ్రేనేజి మౌలిక వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏవో శేషసాయి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

● వరికుంటపాడు : స్థానిక మండల పరిషత్, స్త్రీశక్తి భవన కార్యాలయాల్లో బుధవారం పంచాయతీ, మండల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, డిజిటల్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యం

వరికుంటపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరి నారుమడుల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం జడదేవి, గువ్వాడి గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వరి సాగు చేపట్టబోయే పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. రైతులు డిసెంబరు 15వ తేదీలోపు పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పవన్‌కుమార్, ఆదిత్య, పాల్గొన్నారు.



వరికుంటపాడు: పొలాలను పరిశీలిస్తున్న ఏవో రవికుమార్

● అల్లూరు: రబీ సీజనులో చేపట్టే వ్యవసాయ సాగులో ఎరువుల యాజమాన్యం కీలకమని దీనిపైనే దిగుబడి, నాణ్యత ఆధారపడి ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి శైలజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎరువుల యాజమాన్యం, తెగుళ్ల నివారణ అత్యంత కీలకమైన ప్రక్రియలని వీటిని సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎరువులను విచ్చలవిడిగా వినియోగించి తెగుళ్లను కొని తెచ్చుకునే పరిస్థితి లేకుండా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీహరి నారాయణ పాల్గొన్నారు.

● బిట్రగుంట : బోగోలు మండలం ముంగమూరు, ఏనుగులబావిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి మధురిమ పాల్గొన్నారు. యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధి, ఎరువులు, నీటి యాజమాన్యం, నానో యూరియా, డీఏపీల గురించి వివరించారు.

ఆయకట్టు చివరి పొలాలకు నీరందిస్తాం

● ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ఆయకట్టు చివరి పొలానికి కూడా ఈసీజన్‌లో నీరందిస్తానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్ద అధికారులు, రైతులతో కలిసి గంగమ్మకు జలపూజ చేసి చీర సారె సమర్పించి కుడి, ఎడమ కాలువల తూముఎత్తి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ సోమశిల నుండి 1.50 టిఎంసీల నీరు ప్రాజెక్టుకు వస్తుందని, వరి పంటకు నీటి సమస్య ఉండదన్నారు. కుడి కాలువ నుండి 15క్యూసెక్కులు, ఎడమ కాలువ నుండి 5క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్టు డీఈ వెంకటేశ్వర్లు చెప్పారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఒంగోలు సర్కిల్ ఎస్‌ఈ వరలక్ష్మి, డీఈ మధుసూదనరావు, ఎఈ చంద్రమౌళి, టీడీపీ నాయకులు మద్దాల రామారావు, అడపా రంగయ్య, సోంపల్లి మనోహర్, కేశినేని నాగేశ్వరరావు, గాలంకి ప్రసాద్ పాల్గొన్నారు.



తూము ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

సీఎంను కలిసిన ఇంటూరి

● కందుకూరు: నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియ వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా శాసన సభ్యులు, ముఖ్యనేతలతో కలిసి మంగళవారం అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాన్ని ప్రకాశంలో కలిపే అంశంతోపాటు నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నిబంధనల మేరకు పక్కాగృహాల నిర్మాణం చేపట్టాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చింతలకుంట, దుత్తలూరు గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి సబ్ డివిజన్ డీఈ పీరాన్, ఏఈ యప్రాయం, వర్కుఇన్‌స్పెక్టర్ పోలయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలపై ఆరా

కావలి టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక 36వ వార్డు చెరువుకట్ట గిరిజన సంఘంలో మంగళవారం సీపీఎం మండల నేతలు పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనలో దళితులు మైనార్టీలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలం అతున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డునిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండా యపాళెం మాసాయిపేట గ్రామంలో జరుగుతున్న సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తిచేయాలని సంబంధిత గుత్తేదారులకు సూచించారు. ఈ కార్య క్రమంలో ఏఈ శ్రీనివాసరాజు, టీడీపీ నాయకుడు తుమ్మల కిరణ్ పాల్గొన్నారు.

●వరికుంటపాడు: నల్లబోతులవారిపల్లిలో అంతర్గత రహదారులను డీఈ మణికుమార్ మంగళవారం పరిశీలించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. నిబంధనల మేరకు పనులు జరిగేలా చూడాలన్నారు. అలాగే కాంచెరువులో జరుగుతున్న రహదారి పనులను ఏఈఈ రవీంద్రనాథ్ పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది రమణయ్య, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాకర్ల సహకారంతో ఎస్సార్‌నగర్ అభివృద్ధి

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో సంజీవరెడ్డి నగర్ కాలనీ మరింత అభివృద్ధి చెందుతోందని టీడీపీ జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి తురక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు రూ. 15 లక్షల నిధులతో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

సాదాసీదాగా లింగసముద్రం మండల సమావేశం

లింగసముద్రం, మార్చి 12 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాలకొండరాయునిపాలెం పంచాయతీ ముక్తేశ్వరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంపీటీసీ సభ్యుడు కోరారు. ఆర్‌ఆర్ పాలెంలో పగిలిన మంచినీటి పైపును మరమ్మతు చేయించాలని సర్పంచు చింతగుంపల అంజమ్మ కోరారు. జలజీవన్ మిషన్ ద్వారా చినపవని జగనన్న లేఅవుట్‌లో కూడా పైపులైన్ వేయించాలని సర్పంచు దామా సీతారామయ్య కోరారు. సమావేశానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడంతో సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● జీ రాజేశ్వరరావు, కావలి రూరల్ సీఐ



కావలిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు తెలిపారు.

? గ్రామాల్లో నేరాల నియంత్రణకు ఏ చర్యలు చేపట్టారు.

! గ్రామాల్లో నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల కూడళ్లలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నాం.

? నేరాలు, సైబర్ నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలేంటి.

! పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మహిళాచట్టాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

? రోడ్డు ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ముందుగా జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాం. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు జిగ్‌జాగ్ పద్ధతిలో బారికేడ్లు ఏర్పాటుచేస్తూ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

న్యూస్ బాక్స్

భూసమస్యలపై గ్రామసభ

సీతారామపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సింగారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన భూసమస్యల పరిష్కారం కోసం మంగళవారం తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో పావని పాల్గొని రైతుల నుంచి అర్జీలను పరిశీలించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. సింగారెడ్డిపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం మండలంలో జరుగుతున్న నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీనివాసులు, సర్పంచ్ దుర్గం సంపూర్ణ, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథరెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లింక్‌కు ప్రత్యేక శిబిరాలు

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆధార్ లింక్, కొత్త ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు ఈ నెల 15 వరకు ప్రత్యేక పోస్టల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు కందుకూరు అసిస్టెంట్ సూపరింటెండ్ ఆఫ్ పోస్టాఫీస్ సీహెచ్ మారుతి మధువాణి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో లభించే సంక్షేమ పథకాల బెనిఫిట్స్ లబ్ధిదారుల ఖాతాలలోకి నేరుగా జమ అవుతాయన్నారు. కందుకూరు సబ్ డివిజన్ పరిధిలోని 100 తపాలా బ్రాంచ్ కార్యాలయాలు, సబ్ పోస్ట్ ఆఫీసులు, హెడ్ పోస్ట్ ఆఫీసుల ద్వారా ఆయా పట్టణ, గ్రామాలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా ఇదివరకే ఉన్న ఖాతాలతో పాటు కొత్తగా ఖాతాలు తెరిచి ఆధార్‌లింక్ చేస్తామన్నారు.

దేశానికి వ్యవసాయ రంగం కీలకం

ఉదయగిరి రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశానికి వ్యవసాయ రంగం ఎంతో కీలకం అని మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు దీక్షారంభ్-2024 కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజికంగా, మానసికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు టీ గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, జీ రమేష్, శోభ, అశోక్, హరీష్, క్రాంతి పాల్గొన్నారు.

ఆదినారాయణరెడ్డికి ఘన నివాళి

అల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి తండ్రి ఆదినారాయణరెడ్డి జయంతిని పురస్కరించుకొని స్థానిక విష్ణు నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, పప్పు సుధాకర్, పాపాల ప్రభాకర్‌రెడ్డి, సురేష్‌పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కన్వీనర్‌గా మురారిశెట్టి సుధీర్

కందుకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల కన్వీనర్‌గా మురారిశెట్టి సుధీర్‌కుమార్‌ను నియమించినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కోట హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లాలోని ఆర్యవైశ్య మండల అధ్యక్షుల పదవీకాలం ముగియడంతో నూతన అధ్యక్షుల ఎన్నిక జరిగే వరకు జిల్లా యువజన సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వహిస్తున్న సుధీర్‌కుమార్‌ను కన్వీనర్‌గా నియమించినట్లు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా తటవర్తి వాసు

కావలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టరుగా పట్టణానికి చెందిన తటవర్తి వాసు నియమితులయ్యారు.ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి సిఫార్సుల మేరకు ఆయనకు డైరెక్టర్ పదవి లభించింది. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు.

హైదరాబాద్‌కు స్లీపర్, నాన్‌స్టాప్‌లు నడపండి

● 'డయల్ యువర్ డీఎం'లో ప్రయాణికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు ఆర్టీసీ ఏసీ స్లీపర్ బస్సులు, నాన్‌స్టాప్ సర్వీసులు నడపాలని ప్రయాణికులు కోరారు. నెల్లూరు-1వ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు మంగళవారం సాయంత్రం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. పలువురు ఫోన్ చేసి సమస్యలు తెలుపగా డీఎం మురళీకృష్ణ సమాధానమిచ్చారు. హైదరాబాద్‌కు ఏసీ స్లీపర్ బస్సు సౌకర్యం, నాన్‌స్టాప్ బస్సు నడపాలని నగరానికి చెందిన శివ కోరగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డీఎం తెలిపారు. హైదరాబాదుకు నాన్‌స్టాప్ బస్సులు, కర్నూలు, అనంతపురానికి పగటిపూట సర్వీసులు నడపాలని, వైజాగ్ బస్సు వేళలు మార్చాలని ఎన్ వెంకట్ అనే ప్రయాణికుడు కోరారు. కొండాపురం బస్సును దామరమడుగు స్టేజ్ వద్ద ఆపడంలేదని ఆ గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

లక్కీడిప్‌తో విజేతల ఎంపిక

నెల్లూరు-అల్లూరు రూట్ బస్సుల్లో ఆర్టీసీ-2వ డిపో ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గిఫ్ట్‌స్కీమ్‌కు సంబంధించి బుధవారం ఆత్మకూరు బస్టాండులో లక్కీడిప్ నిర్వహించారు. సిరి (96768 62846), శిరీష(8886199342)ను విజేతలుగా ప్రకటించారు. త్వరలో బహుమతు లిస్తామని డీఎం శివకేశవయాదవ్ తెలిపారు.

కార్తీక దీపోత్సవ శోభాయాత్రకు రండి : గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న కార్తీకపౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న దీపోత్సవంలో భాగంగా జరిగే శోభాయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన టీడీపీ మహిళా నాయకురాళ్లతో సమావేశం నిర్వహించి గణేష్ ఘాట్‌లో జరిగే దీపోత్సవానికి ప్రతి మహిళ హాజరు కావాలన్నారు.

రీసర్వే గ్రామసభ రసాభాస

● రైతులకు న్యాయం చేస్తాం : తహసీల్దారు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచేడులో రీసర్వేపై మంగళవారం జరిగిన గ్రామసభ రసాభాసగా సాగింది. గ్రామసభకు వచ్చిన రైతులు రీసర్వేలో వచ్చిన భూ సమస్యలతో పాటు సాదాబైనామా, ఇతర రెవెన్యూ సమస్యలపై తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ ఎదుట ఏకరువు పెట్టారు. రీసర్వే పూర్తయ్యేలోపు నలుగురు తహసీల్దార్లు మారినా సమస్యలను పరిష్కరించి న్యాయం చేసిన అధికారి ఒక్కరూ లేరని స్థానిక రైతు పెనాక అమరనాథరెడ్డి, తదితర రైతులు కోరారు. కొంతమందికి చెల్లని ఇళ్ల పట్టాలు ఇచ్చారని చూపించారు. ఈ క్రమంలో సభలో కొంతసేపు రైతులు, అధికారుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. రీసర్వేకి ముందు తనకు 5.42 ఎకరాల భూమి ఉండగా రీసర్వే తరువాత 7.34 ఎకరాలు ఉన్నట్లు పాసుపుస్తకం ఇచ్చారని రైతు సుధాకర్‌రెడ్డి వాపోయారు. దీనిని సరిచేయాలని సచివాలయం, తహసీల్దారు కార్యాలయం, అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. తమ భూమిని సర్వే చేయాలని కోరారు. ఇలా ఎంతో మంది రైతులు రీసర్వే సమస్యలపై గగ్గోలు పెట్టారు. అందరికీ న్యాయం చేస్తామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : పంచేడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు



కొడవలూరు : తహసీల్దారును సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి

కొడవలూరు(ఆంధ్రజ్యోతి): ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ కొడవలూరులో మంగళవారం జరిగిన రీసర్వే గ్రామసభలో టీడీపీ మాజీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు తువ్వర ప్రవీణ్ తహసీల్దారు స్ఫూర్తిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కొడవలూరు రెవెన్యూ పరిధిలో సుమారు ఐదు ఎకరాల భూమి ఆక్రమణలో ఉందన్నారు. ఎంతో మంది నిరుపేదలకు నివేశన స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం టీడీపీ నాయకులు వెంకీ, నక్క రమణయ్య తదితరులు తహసీల్దారును సత్కరించారు.

లోపరహిత రికార్డుల తయారీకి కృషి

● నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్

నెల్లూరు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి తప్పులు లేని విధంగా రికార్డులు తయారు చేసేందుకు క్షేత్ర స్థాయి నుంచి కృషి చేస్తున్నామని నెల్లూరు రూరల్ తహసీల్దారు లాజరస్ తెలిపారు. ఈ మేరకు వివరాలు సేకరిస్తున్నామని, రానున్న రోజుల్లో లోపాలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లో...



ఈ వారం ముఖాముఖి

? ప్రస్తుత రెవెన్యూ సదస్సుల్లో ఎలాంటి సమస్యలపై ఫిర్యాదులొస్తున్నాయి.

! తమకున్న భూ విస్తీర్ణం తగ్గిందన్నది ఎక్కువగా వస్తున్న ఫిర్యాదుల్లో ఒకటి. రిజిస్ట్రేషన్ ఒకరి పేరిట ఉంటే భూమి మరొకరిది కావడం, రికార్డుల్లో పేర్లు తప్పులున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాము.

? భూ ఆక్రమణలు ఎక్కువవుతున్నాయి. నియంత్రణ ఎలా.

! మా దృష్టికి వచ్చిన ఆక్రమణలను అప్పటికప్పుడు తొలగిస్తున్నాము. ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవడం నేరం. దీనికి శిక్షలు కూడా ఉంటాయి. ఆక్రమణల విషయమై ప్రజలు కూడా స్వచ్ఛందంగా సమాచారం ఇవ్వాలని కోరుతున్నాను.

? మీ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండరన్న ఆరోపణ ఉంది. మీరేమంటారు.

! కోర్టు కేసులు, ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లడం మినహాయిస్తే అందరూ పనివేళల్లో అందుబాటులో ఉంటున్నారు. ఈ విషయం తెలియక కుర్చీలో లేకపోతే ఆ ఉద్యోగి కార్యాలయానికి రాలేదనుకుంటున్నారు.

? వీఆర్వోలు సచివాలయాలకు రావడంలేదంట. నిజమేనా..

! ఎక్కడ అలా జరుగుతోందో స్పష్టంగా చెబితే నేనే స్వయంగా విచారించి చర్యలు తీసుకుంటాను. ఎప్పటికప్పుడు ఆర్ఐ, డీటీలతో వాకాబు చేయిస్తున్నాము. ప్రజలు నాకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

న్యూస్ బాక్స్

మాజీ మంత్రి కాకాణి పాపాలు పండుతున్నాయి!

పొదలకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన పాపాలు ఒక్కొక్కటిగా పండుతున్నాయని, ఆయన జైలు శిక్ష నుంచి తప్పించుకోలేరని టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో అధికార బలంతో వావిలేటిపాడు భూ వివాదం విచారణ రిపోర్టును మాయం చేయించారన్నారు. ఆర్డీవో లేఖ, పత్రికల్లో వార్తలు, కలెక్టర్ సీరియస్ కావడంతోనే యథాస్థానానికి రికార్డులు చేర్చారన్నారు. ఈ క్రమంలో ఆయన చట్టప్రకారం శిక్ష అనుభవించక తప్పదన్నారు.

నేత్రదానం

నెల్లూరు (వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చిన్న బజారుకు చెందిన వరదా ఆళ్వార్ (80) మంగళవారం మృతిచెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. టెక్నీషియన్ వేణుగోపాల్ ఆ నేత్రాలను సేకరించారు. నేతదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, ఆళ్వార్ కుటుంబ సభ్యులు హరికృష్ణ, దోర్నాదుల శేష పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు హర్షణీయం

కోవూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ అధిక మొత్తంలో నిధులు కేటాయించడం హర్షణీయమని టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లురెడ్డి అన్నారు. టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి పారుదల రంగానికి అత్యధిక నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

షమీర్‌పై రౌడీషీట్

నెల్లూరు(క్రైం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొటమిట్ట ప్రాంతం ఖుద్దూస్‌నగర్‌కు చెందిన పాత నేరస్తుడు షేక్ షమీర్‌పై చిన్న బజారు పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మంగళవారం రౌడీషీట్ తెరిచారు. షమీర్‌పై సూళ్లూరుపేట పోలీసు స్టేషన్‌లో 2020లో పోక్సో కేసు, చిన్నబజారు, నవాబుపేట స్టేషన్లలో పలు కేసులున్నాయని తెలిపారు.

వైభవంగా శ్రీనివాసుడి నగరోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : చిలుక ఏకాదశి సందర్భంగా శ్రీనివాసుడి నగరోత్సవం నెల్లూరులో మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. సింహపురి గోవిందమాల కమిటీ, కనకదుర్గా సేవా సమితి సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించాయి. స్వామిని హంస వాహనంపై సరస్వతీ అలంకారంలో కొలువుదీర్చారు. మహిళల కార్తీక దీప హారతులతో నగరోత్సవం పప్పులవీధి నుంచి రాజరాజేశ్వరి ఆలయం వరకు సందడిగా సాగింది.

రేపటి నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విడవలూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు లైబ్రరీయన్ నిరూప మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు పుస్తక ప్రదర్శన, వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని ఆమె కోరారు.

గోడపత్రిక ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతున్న సందర్భంగా మంగళవారం గ్రంథాలయ అధికారిణి మంజులత గోడపత్రిక ఆవిష్కరించారు. ఈనెల 14నుంచి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మొదటి రోజు బాలల దినోత్సవం, చివరిరోజు విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, పాఠకులు పాల్గొన్నారు.



బుచ్చి : గోడపత్రిక ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ అధికారిణి

'మెడికవర్'లో శ్వాసనాళ శస్త్రచికిత్స

నెల్లూరు(వైద్యం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్వాసతీసుకోలేక తీవ్ర ఆయాసంతో బాధపడుతున్న 85 ఏళ్ల వృద్ధురాలికి మెడికవర్ ఆసుపత్రిలో ట్రకియల్ స్టినోసిస్ అనే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ కౌశిక్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామానికి చెందిన ఏళ్ల వెంకటమ్మ (85) నాలుగు రోజుల క్రితం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిందన్నారు. పరీక్షించగా శ్వాసనాళంలో కండపెరిగి గడ్డగా తయారైందని గుర్తించామన్నారు. శస్త్రచికిత్స చేసి ఆ గడ్డను తొలగించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్ హెచ్‌వోడీ డాక్టర్ రాజేష్, డాక్టర్ రంగనాథ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి, కేన్సర్ ఆసుపత్రి హెడ్ డాక్టర్ బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కౌశిక్‌రెడ్డి

రోజంతా వాన

● రోడ్లపై నీటి మడుగులు ● జన జీవనానికి అసౌకర్యం



హోటల్ అమరావతి రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

నెల్లూరు(సిటీ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనానికి ఈశాన్య రుతుపవనాలు తోడవడంతో నెల్లూరు నగరంలో సోమవారం రాత్రి మొదలైన వర్షం మంగళవారం రోజంతా కురుస్తూనే ఉంది. బుజబుజ నెల్లూరు వద్ద అత్యధికంగా 84 మి.మీ. వర్షం కురవగా గాంధీనగర్, కరెంటాఫీస్ సెంటర్లో 71, మాదరాజుగూడూరులో 62, మున్సిపల్ కార్యాలయం వద్ద 57, కేన్సర్ ఆసుపత్రి వద్ద 56, ఏఆర్ఎస్ కేంద్రం, మాగుంటలేఅవుట్ వద్ద 52, పీఎంఆర్ హైస్కూల్ వద్ద 33 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఆత్మకూరు బస్టాండ్, విజయమహల్ గేట్, మాగుంట లేఅవుట్, రామలింగాపురం వద్దనున్న అండర్‌బ్రిడ్జీలు వర్షపు నీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులపై పలుచోట్ల నీటి మడుగులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు అసౌకర్యానికి గురయ్యారు. అక్కడక్కడ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో నగరవాసులకు ఇక్కట్లు తప్పలేదు.

జాగ్రత్త : కమిషనర్

వాతావరణం మారింది. వర్షాలొస్తున్నాయ్... జాగ్రత్తలు తీసుకోండి అంటూ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి నగరంలోని లోతట్టు ప్రాంతాలు, అండర్‌బ్రిడ్జీల వద్ద నీరు నిలవడంతో ఆయా ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు. మోటర్లతో నీటిని తోడేయాలని సూచించారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టాలని, ప్రజల అవసరాలకు తగ్గట్టు పురపాలక సేవలుండాలని ఆదేశించారు.



సుబేదార్‌పేటలో...

కార్మిక వర్గానికి బడ్జెట్లో ప్రాధాన్యత నిల్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో సోమవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వలేదని జిల్లా ఆటో కార్మిక సంఘం కార్యదర్శి అన్నారు. మంగళవారం బుచ్చి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన మండల ఆటో యూనియన్ జనరల్‌బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ట్రాన్స్‌పోర్టు, కార్మిక రంగాలకు సరైన కేటాయింపులు ఇవ్వలేదన్నారు. ఆటో కార్మికులు కూడా పోలీసు నిబంధనలకు అనుగుణంగా ప్యాసింజర్లను రవాణా చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ.రాజు అన్నారు.. ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పాశం రాజయ్య, దాసరి రాజయ్యలతో పాటు 13 మందిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మునీర్ అహ్మద్, మల్లికార్జున, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

నెల్లూరులో ట్రైనీ ఐఏఎస్‌లు

నెల్లూరు(సిటీ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు శిక్షణ నిమిత్తం కేటాయించబడిన నూతన ఐఏఎస్ అధికారులు మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రధాన రోడ్లు, కూడళ్ల వద్ద పారిశుధ్య నిర్వహణ తీరును తెలుసుకున్నారు. బీవీనగర్ మున్సిపల్ హైస్కూల్లో విద్యా బోధన తీరును పరిశీలించారు. జాకీర్‌హుస్సేన్ నగర్ వద్దనున్న మురికివాడలను సందర్శించి ప్రజల జీవన విధానాన్ని తెలుసుకున్నారు. కార్పొరేషన్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, విధిస్తున్న పన్నులు, నగరంలో రూపుదిద్దుకుంటున్న నూతన పనులు, నెల్లూరీయుల ప్రత్యేకతను ఏడీసీ నందన్, టీపీఆర్వో బాలకృష్ణ వివరించారు. ఉత్తర భారతదేశానికి చెందిన 10 మంది ట్రైనీ ఐఏఎస్‌లతో కూడిన ఆ బృందం పలు ప్రభుత్వ శాఖల పనితీరును క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ కార్పొరేషన్‌కు వచ్చింది.



జకీర్‌హుస్సేన్‌నగర్‌లో పర్యటిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

వీఎస్‌యూలో అంధకారం

● భారీ వర్షం కారణంగా నిలిచిన సరఫరా

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో మంగళవారం వేకువజాము నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం నెలకొంది. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతోపాటు పిడుగుల కారణంగా వీఎస్‌యూకు వచ్చే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. దీంతో వీఎస్‌యూలో విద్యుత్ సరఫరా నిలిచినట్లు వర్శిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. సరఫరా లేక విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. దీనిపై వర్శిటీ అధికారులు విద్యుత్ శాఖకు సమాచారం అందించారు. దీనిపై వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు అయ్యేంత వరకు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేశారు.

ఉత్తమ అధ్యాపకుడికి అభినందనలు

వెంకటాచలం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్శిటీలో బయోటెక్నాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ కేవీ ప్రభాకర్ 2024 ఏడాదికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. దీంతో మంగళవారం ఆయనను వర్శిటీ వీసీ డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, అధ్యాపకు లు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నెల్లూరు (జడ్పీ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుందరయ్య కాలనీలో లోవోల్టేజ్ సమస్య ఉండడంతో దానిని పరిష్కరించేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈ అశోక్ మాట్లాడుతూ ఏకే నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పడారుపల్లి, సుందరయ్య కాలనీల్లో లోవోల్టేజ్ సమస్య ఏర్పడడంతో ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో 100 కేవీ సామర్థ్యం కలిగిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. దీనికి ప్రత్యేకంగా కృషిచేసిన బీవీ నగర్ ఏఈ దామోదర్‌ను, సిబ్బందిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

కోటంరెడ్డికి అభినందనలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఎన్నికైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి మంగళవారం ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొనగళ్ల శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఏవీ ఫణీంద్రబాబు, కోశాధికారి భోగనాదం సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

పొదలకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమ్మదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్ప ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్ అధికారులు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ వీ.నరసింహారావు, డాక్టర్ కె.స్రవతి మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అమ్మాయికి 18ఏళ్లు, అబ్బాయికి 21ఏళ్లు నిండిన తరువాత వివాహం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం ఐసీడీఎస్, సీడీపీవో విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

నెల్లూరురూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ అధికారులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకుడు రమేష్, జిల్లా శిక్షణ మేనేజర్ వైవీ శివ, ఎంపీడీవో శైలేంద్రకుమార్ పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల్లో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలపై అవగాహన కల్పించారు. నిధుల సమీకరణ, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వం నుంచి అందుతున్న వివిధ సేవలను వివరించారు.

శభాష్ పోలీస్

● వర్షపు నీటిలో చిక్కిన కారు
● కుటుంబాన్ని కాపాడిన సీఐ, సిబ్బంది

నెల్లూరు(క్రైం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వర్షపు నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని పోలీసులు కాపాడి ప్రజల ప్రశంసలు అందుకున్నారు. నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రామలింగాపురం అండర్ బ్రిడ్జి నీటితో నిండింది. అదే సమయంలో ఓ కారు వచ్చి అక్కడి నీటిలో ఆగిపోయింది. అందులోని మహిళలు, చిన్నారులు కారు దిగలేని పరిస్థితుల్లో 112 నెంబరుకు ఫోన్ చేశారు. నైట్ రౌండ్స్ విధులు నిర్వహిస్తున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా వెంటనే బ్రిడ్జి వద్దకు చేరుకుని పరుగులు తీశారు. సిబ్బంది కూడా ఆయనతో కలిసి కారును నీటిలో నుంచి బయటకు నెట్టుకుంటూ వచ్చారు. కారులో ఇరుక్కుపోయిన కుటుంబం ఇన్‌స్పెక్టర్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ వార్త, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



కారును నీటిలో నుంచి బయటకు నెట్టుకొస్తున్న ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తదితరులు

కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన



జొన్నవాడలో కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 12: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో మంగళవారం కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. 20 మందికిపైగా అర్చకులు లలిత సహస్రనామ పూజలు చేశారు. భక్తులు, తదితరులు లక్ష కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు.

రైతు సంఘాల మహిళలకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళా రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘాల మహిళలకు బుధవారం డీసీవో కార్యాలయంలో శిక్షణా ఇచ్చారు. డీసీవో గురప్ప మాట్లాడుతూ సంఘాలను చట్ట ప్రకారం నిర్వహించాలని సూచించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి : డీఈవో


నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా విద్యాశాఖా ధికారి బాలాజీరావు పిలుపునిచ్చారు. మంగళవారం రోటరీ క్లబ్‌లో జరిగిన ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. పేద విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకునేందుకు రోటరీ క్లబ్‌కు దాతలు ఇచ్చిన నిధులపై వడ్డీని ప్రతిభా పురస్కారాల పేరిట ప్రదానం చేయడం ప్రశంసనీయమన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు బెజవాడ నరేష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది కళాశాల, పాఠశాలల్లో ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.5వేల నగదు, బ్యాగు, ప్రశంసా పత్రం అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ ట్రస్ట్ చైర్మన్ బీ మధుసూదన్‌రావు, కార్యదర్శి సనత్ కుమార్ రెడ్డి, రోటరీ క్లబ్ కార్యదర్శి పీ అఖిలేష్‌రెడ్డి, సభ్యులు, పాల్గొన్నారు.



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో రోటరీ క్లబ్, ట్రస్ట్ సభ్యులు

మందకృష్ణతో యానాది మహాకూటమి భేటీ

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సాధించి 12లక్షల మంది యానాదుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న లక్ష్యంతో సోమవారం ఒంగోలులో యానాదుల ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభకు విచ్చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను నెల్లూరు జిల్లా యానాది మహాకూటమి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తమ పోరాటానికి మద్దతివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు ఏకుల సుధీర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇండ్ల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



'పవర్'ఫుల్ గ్రామం

ఆ ఊరు చాలా 'పవర్'ఫుల్. 70 శాతం ఇళ్లల్లో విద్యుత్తు శాఖ ఉద్యోగులున్నారక్కడ. 1956 నుంచి కాంట్రాక్టు కార్మికులుగా మొదలై.. పర్మినెంట్ ఉద్యోగులయ్యారు. విద్యుత్తు శాఖ విస్తరించే కొద్దీ ఈ గ్రామంలో ఆ శాఖ ఉద్యోగులూ పెరుగుతూ వచ్చారు. ఆ 'పవర్'ఫుల్ గ్రామం గురించి తెలుసుకుందాం..

- 6లో

నవధాన్యాలతో అభిషేకం



బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.43,402 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422 కోట్లు.. ఇలా ఎక్కువ నిధులు కేటాయించారంటూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం నవధాన్యాలతో అభిషేకించారు. చంద్రగిరి మండలం దానామూర్తి పల్లెలో ప్రకృతి రైతు కొమ్మినేని దామోదరనాయుడు ఆధ్వర్యంలో రైతులు దయానందనాయుడు, స్వర్ణలత, అన్నపూర్ణ తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



అందరూ అతివలే

ఆ ప్రభుత్వ కార్యాలయానికి వెళితే అందరూ మహిళా ఉద్యోగులే కనిపిస్తారు. అధికారి నుంచి అటెండరు వరకూ వాళ్లే. అదే ఎర్రావారిపాలెం మండల పరిషత్ కార్యాలయం. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎంపీడీవోగా అరుణ, సీనియర్ సహాయకులుగా జీఎస్ శ్యామల, జూనియర్ సహాయకురాలిగా పుష్పలత, టైపిస్ట్‌గా రమణమ్మ, ఈవోఆర్డీగా మాలతి, హెడ్ క్వార్టర్ పంచాయతీ కార్యదర్శిగా మేనక, అటెండర్‌గా హసీనా ఈ కార్యాలయంలో చేరారు.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

- ముగిసిన విచారణ.. ప్రభుత్వానికి నివేదిక
- జిల్లావ్యాప్తంగా ఫ్రీ హోల్డ్‌లో 76 వేల ఎకరాలు
- దాదాపు 30 వేల ఎకరాల్లో నిబంధనల ఉల్లంఘన
- మరో నాలుగు రోజుల్లో ముగియనున్న పరిశీలన

మాటల్లేవ్. మాట్లాడుకోవడాల్లేవ్. నిబంధనలు ఖాతరు చేయడాల్లేవ్. అంతా మేం చెప్పినట్లే చేయాలంతే. అలా.. వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. కొందరు అధికారులూ ఉత్సాహం చూపారు. నిబంధనలకు విరుద్ధంగా చాలావరకు నిషేధిత భూములను ఫ్రీ హోల్డ్ చేయించారు. వీటిలో 702 ఎకరాలను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేసుకున్నారు. కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం బయటపడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అడ్డగోలుగా..!



702 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై విచారణ కొనసాగుతోంది. ఫ్రీ హోల్డ్ చేయడంలో.. చేసిన వాటి రిజిస్ట్రేషన్లలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. 2003కు ముందు జారీ చేసిన అసైన్‌మెంట్.. డీకేటీ పట్టాలకు చెందిన భూములను మాత్రమే ఫ్రీ హోల్డ్ చేయడానికి జీవో అవకాశం కల్పించింది. జిల్లాలో మాత్రం 2003 తర్వాత జారీ అయిన అసైన్‌మెంట్ పట్టా భూములనూ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టు విచారణ అధికారులు గుర్తించారు. పశువుల మేత పోరంబోకు భూములుగా రికార్డుల్లో నమోదైన వాటిని ఫ్రీ హోల్డ్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ వీటికి కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చినా ప్రభుత్వం నుంచి అనుమతి రానిదే ఫ్రీ హోల్డ్ చేయకూడదని నిబంధనలున్నాయి. అలాంటి పశువుల మేత పోరంబోకు భూములనూ ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్టర్ చేసేశారు. ఒకరి పేరిట పట్టా జారీ అయిన భూముల్లో ఇతరులు ఉన్నట్లయితే వాటినీ ఫ్రీ హోల్డ్ చేయకూడదు. ఇలా నిబంధనన్నీ ఉల్లంఘించి 702 ఎకరాలకు రిజిస్టర్ చేశారని పక్కాగా నిర్ధారించారు.

60 వేల ఎకరాల్లో పరిశీలన పూర్తి

జిల్లావ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం 76 వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి ఫ్రీ హోల్డ్ చేసిన క్రమంలో కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికి 60 వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన కూడా పూర్తి చేశారు. ఈ 60 వేలల్లో సుమారు 30 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసినట్టు గుర్తించారు. మిగిలిన 16 వేల ఎకరాలపై విచారణ మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. అందులో ఎన్ని ఎకరాల విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందో తేలనుంది.

ఆ భూముల విలువ అపారం

జిల్లాలో రిజిస్టర్ అయిన 1761 ఎకరాల్లో వెయ్యి ఎకరాలు కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, చంద్రగిరి మండలాల్లోనే ఉన్నాయి. ఇక్కడి భూములకు విలువ ఎక్కువ. శ్రీకాళహస్తి మండలంలోని మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరా రూ.30 లక్షల దాకా పలుకుతోంది. ఇక ప్రధాన రహదారులకు చేరువగా ఉంటే రూ.కోట్లు పలుకుతోంది. మిగిలిన మూడు మండలాల్లోనూ ఎకరా రూ.కోట్లలోనే ఉంది. పోనీ, ఎకరా రూ.30 లక్షలతోనే లెక్కించినా కూడా అక్రమంగా రిజిస్టర్ అయిన వెయ్యి ఎకరాల విలువ రూ. 300 కోట్లు. వాస్తవ విలువ మేరకు లెక్కిస్తే ఆ మొత్తం రూ. వేల కోట్లకు చేరుతుంది. కూటమి ప్రభుత్వం వీటి రిజిస్ట్రేషన్లను నిలపకుంటే.. అంత భారీ మొత్తాన్ని ప్రభుత్వం నష్టపోయినట్టు అయ్యేది.

ఎన్నికలు సమీపించిన తరుణంలోనే..

నిజానికి నిషేధిత జాబితాలోని భూముల స్వభావం, ఫ్రీ హోల్డ్ చేయడానికి అర్హత ఉందా లేదా అన్నది వీఆర్వో రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారించి డిప్యూటీ తహసీల్దారుకు ప్రతిపాదించాలి. తన స్థాయిలో డీటీ పరిశీలించి నిర్ధారించుకున్నాక తహసీల్దారుకు నివేదించాలి. ఆయన క్రాస్ చెక్ చేసుకుని ఆర్డీవోకు సిఫారసు చేస్తే.. ఆయన ఆ ఫైలును క్షుణ్ణంగా పరిశీలించి జేసీకి పంపాలి. జేసీ నుంచి అందిన ప్రతిపాదనలపై కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తే గానీ నిషేధిత జాబితా నుంచీ భూములు ఫ్రీ హోల్డ్ కావు. అయితే సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో త్వరగా డీకేటీ, అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్టర్ చేసుకోవాలనే తలంపుతో వైసీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. దీంతో చాలావరకూ తహసీల్దారు స్థాయిలోనే భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టు తెలిసింది. కొంత మేరకు ఆర్డీవోల స్థాయిలో ఈ తంతు నడిచినట్టు సమాచారం. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ ప్రహసనం నడిచింది. దీంతో బాధ్యులపై ప్రభుత్వం కనుక చర్యలకు దిగితే పెద్ద సంఖ్యలో వీఆర్వోలు, డీటీలు, తహసీల్దార్లతో పాటు ఆర్డీవోలపైనా వేటు పడుతుంది. దీంతో చర్యలకు సిఫారసు చేసే విషయంలో ఏమి చేయాలో తోచక జిల్లా యంత్రాంగం సతమతమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో..

- ఫ్రీ హోల్డ్ చేసింది: 76 వేల ఎకరాలు
- నిబంధనల ఉల్లంఘన: 30 వేల ఎకరాల వరకు..
- మొత్తం రిజిస్ట్రేషన్లు జరిగింది: 1761 ఎకరాలు
- వీటిలో అడ్డగోలుగా చేసింది: 702 ఎకరాలు

8 మందికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు

- వన్యకుల క్షత్రియ కార్పొరేషన్‌లో ఏడుగురికి చోటు
- ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో ఒకరికి స్థానం

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో జిల్లా నుంచి ఎనిమిది మందికి చోటు దక్కింది. వన్యకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్‌లో మొత్తం 15 మంది డైరెక్టర్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులే కావడం విశేషం. అందులో ఏడుగురు తిరుపతి జిల్లా నుంచి నియమితులయ్యారు. ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్‌లో ఒకరికి స్థానం లభించింది. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు టీడీపీ.. జనసేన, బీజేపీ నుంచి ఒక్కోనేత ఉన్నారు. వన్యకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన వారిలో తిరుపతికి చెందిన బాలసుబ్రహ్మణ్యం (జనసేన), జీపాలెం తేజోవతి (బీజేపీ), శ్రీకాళహస్తికి చెందిన చెర్లోపల్లె సుబ్రమణ్యం, పి.చిన్నారెడ్డి, మినరల్ రవి (టీడీపీ).. సూళ్లూరుపేటకు చెందిన కొళవి సెల్వం, చంద్రగిరికి చెందిన పి.మునిరత్నంరెడ్డి (టీడీపీ) ఉన్నారు. అలాగే ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్‌లో చంద్రగిరికి చెందిన వి.ఎస్.బద్రీ నారాయణ (టీడీపీ) డైరెక్టరుగా అవకాశం దక్కించుకున్నారు.



సెల్వం




మునిరత్నం రెడ్డి



చిన్నారెడ్డి



తేజోవతి



మిన్నల రవి



బద్రీనారాయణ

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారమూ అడపాదడపా కురుస్తూనే ఉంది. దీంతో వాతావరణం చల్లబడింది. కోటలో 108మి.మీ., వాకాడు 80.2, దొరవారిసత్రం 49.8, సూళ్లూరుపేట, చిట్టమూరు 46.4, చిల్లకూరు 34.4, గూడూరు 31.4, నాయుడుపేట 28.2,, ఓజిలి 27.4, బాలయపల్లి 19.8, బుచ్చినాయుడుకండ్రిగ 19.6, వరదయ్యపాళెం 19.4, పెళ్లకూరు 14.4, వెంకటగిరి 12.2, తడ 104మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఇక పోలీసు వద్దా ఆధార్

- నేర పరిశోధనలో మరింత వేగం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు శాఖకు ఆధార్ అనుసంధానం కానుంది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ఈ దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు నేరస్థులు, అసాంఘిక శక్తుల వేలి ముద్రలు, కనుబొమ్మలు మాత్రమే పోలీసు శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయి. వీటివల్ల నేరపరిశోధనలో అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఇకపై ఆధార్ కార్డులను పోలీసు శాఖకు అనుసంధానం చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ప్రతి ఒక్కరి ఆధార్ కార్డును పోలీసు శాఖకు అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆధార్ డేటాను పర్యవేక్షించే యూనిక్ ఐడెంటిఫికేషన్ యాప్‌ను అందుబాటులోకి తేనుంది. దీంతో పాటు ప్రభుత్వంపైన, ప్రభుత్వ పెద్దలపైన సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విమర్శలు, ఆరోపణలు చేస్తున్న వారిని ఆధార్ నెంబరు ఆధారంగా గుర్తించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా తొలి దశలో దాదాపు లక్ష నుంచి రెండు లక్షల మంది ఆధార్ కార్డులు పోలీసు యూనిక్ ఐడీతో అనుసంధానం చేసి తద్వారా వచ్చే ఫలితాలను బట్టి మిగిలిన వారి ఆధార్‌ను పోలీసు శాఖకు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల నేర పరిశోధనలో పోలీసులకు మరింత వెసులుబాటు లభించనుంది.

బాలింతలకు ప్రత్యేక గది

- వారం రోజుల్లో మరో గది ఏర్పాటుకు సన్నాహాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రుయా చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న నవజాత శిశువుల కోసం ఆస్పత్రిలో ఉంటున్న బాలింతలకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ రవిప్రభ తెలిపారు. చికిత్స పొందుతున్న 'చంటి బిడ్డల కోసం' వార్డుల ముందు అవస్థలు పడుతున్న బాలింతల విషయంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఏపీఎంఐసీడీసీ అధికారులతో కలిసి మంగళవారం బాలింతలు ఉంటున్న ఆవరణాన్ని పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తల్లుల కోసం ఏర్పాటు చేసిన రెండు విశాలమైన గదులను కొవిడ్ తర్వాత వ్యాక్సిన్ కోసం ఉపయోగిస్తున్నామన్నారు. తిరిగి వాటిని తల్లులు ఉండేందుకు అనుకూలంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతానికి అందులో ఒక గదిని సిద్ధం చేశామన్నారు. వారంలో మరో గదిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రస్తుతం బాలింతలు ఉంటున్న వరండాల్లో దోమల బెడద, ఉక్కపోతల సమస్యలు లేకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



ఖాళీ గదులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రవిప్రభ

పవర్‌ఫుల్.. నెల్లటూరు



- 70 శాతం ఇళ్లల్లో విద్యుత్తుశాఖ ఉద్యోగులే
- సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయమే కారణం

నెల్లటూరు.. వెంకటగిరి ప్రధాన రహదారిలో, గూడూరు పట్టణ పరిధి దాటగానే ఈ గ్రామం ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో 400కు పైగా ఇళ్లున్నాయి. 280కు పైగా గృహాలలో విద్యుత్తు శాఖలోని ఏదో ఒక విభాగంలో ఉద్యోగులుగా పనిచేసే వారుంటారు. అందుకే ఆ గ్రామం 'పవర్'ఫుల్ అంటూ చమత్కరిస్తుంటారు. - గూడూరు, ఆంధ్రజ్యోతి

మార్పు మొదలైందిలా..

గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి ఆనుకుని గోగినేనిపురం వస్తుంది. ఆ రోజులలో గోగినేనిపురం.. మైకా పరిశ్రమలకు ప్రసిద్ధి. గూడూరు, నెల్లటూరు, చెన్నూరు, తిప్పవరపాడు గ్రామాల నుంచీ ఆడ, మగ కార్మికులు మైకా పరిశ్రమలలో పనులకు వెళ్లి జీవనోపాధి పొందేవారు. ఈ క్రమంలో నెల్లటూరు గ్రామంలో విద్యుత్‌శాఖ 1956వ సంవత్సరంలో జిల్లా స్టోర్స్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో దీని కోసం ఓ దాత ఆరు ఎకరాల స్థలం ఇచ్చారు. ఈ స్టోర్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్తు తీగలను నిల్వ ఉంచి.. నెల్లూరు జిల్లాలో అవసరమైన చోటికి తరలించేవారు. జిల్లాలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లనూ ఇక్కడికి తీసుకొచ్చి.. బాగు చేసి పంపేవారు. వీటికి కూలీల అవసరం ఎక్కువ. అదే సమయంలో కొన్ని కారణాలతో మైకా పరిశ్రమలలో మగవాళ్లను తొలగించి మహిళలకే అవకాశం ఇచ్చారు. దీంతో నెల్లటూరు గ్రామానికి చెందిన వారు విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులతో పాటు సిమెంట్ విద్యుత్ స్తంభాల నిర్మాణ, ఇతర పనులు చేసేందుకు కాంట్రాక్టు కార్మికులుగా చేరారు.



జిల్లా స్టోర్స్ కార్యాలయం

సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయం..

1983 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ఎన్టీఆర్ సీఎం అయ్యాక కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేశారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు.. వారి అర్హతను బట్టి హెల్పర్లుగా పర్మినెంట్ ఉద్యోగులుగా మారిపోయారు. ఇక్కడ నుంచే ఉద్యోగాల ప్రస్థానం మొదలైంది. క్రమేణా విద్యుత్ వినియోగం పెరగడంతో కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. ఆ సబ్‌స్టేషన్లలో షిఫ్టు ఆపరేటర్ల ఉద్యోగాల కోసం.. జిల్లాస్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది తమ పిల్లలను అర్హతను బట్టి చేర్పించారు. ఇక, హెల్పర్లు.. లైన్‌మెన్‌గా పదోన్నతులు పొందారు. కొంతమంది ఉద్యోగులు అనారోగ్యంతో మృతి చెందగా.. కారుణ్య నియామకాల కింద వారి పిల్లలు అదే శాఖలో ఉద్యోగాలు పొందారు. కొంతకాలం కిందట గోగినేనిపురంలో డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడా ఎక్కువ మంది సిబ్బంది నెల్లటూరుకు చెందిన వారే. ఇలా కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారు క్రమేణా పర్మినెంట్ కావడం, లైన్‌మ్యాన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు పొందారు. అటెండర్ల నుంచి ఏడీఈల వరకు.. ఇలా ఏదో ఒక స్థాయిలో విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక, వాహనాలలో విద్యుత్ పరికరాలను లోడ్, అన్‌లోడ్ చేసేందుకు సుమారు 30 మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.



జిల్లా స్టోర్స్‌లోని విద్యుత్ పరికరాలు

వైసీపీలో రసవత్తరంగా వర్గపోరు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ వర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పార్టీ ఎప్పుడో చీలిపోయింది. సంజీవయ్య టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ ఎన్నికలకుముందు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం స్పష్టంచేశాయి. ఇవేవీ పట్టించుకోని అధిష్టానం 3వ సారి కిలివేటి సంజీవయ్యకే టిక్కెట్ కేటాయించడంతో ఆ ఎన్నికల్లో వీరంతా కొంత వ్యతిరేకంగా పనిచేశారన్న ప్రచారం జరిగింది. కూటమి అధికారంలోకి రావడంతో దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరతానంటూ ప్రకటించడంతో ఆ వర్గం నాయకులంతా ఆ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఈ వర్గం టీడీపీలో చేరేందుకు ఆ పార్టీలో ఉన్న ఒక వర్గం అడ్డుకోవడంతో దువ్వూరు వర్గం చేరిక వాయిదాపడింది. ఈ క్రమంలో సంజీవయ్య వర్గం గత శుక్రవారం వైసీపీ అధినేత జగన్‌ను కలిసి మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి వర్గంపై ఫిర్యాదు చేశారు. టీడీపీతో తిరుగుతూ పార్టీ ఓటమికి కృషి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ప్రధాన కారణమంటూ వివరించారు. జగన్ ఆదేశాలతో ఉమ్మడి నెల్లూరుజిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శేఖర్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేశారు. అదే సమయంలో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం నాయకులు తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిశారు. షోకాజ్ నోటీసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తమను కిలివేటి సంజీవయ్య కలుపుకుపోవడంలేదని వారు సైతం ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. అన్నింటిని పక్కనపెట్టి పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని జగన్ చెప్పినట్లుగా తెలుస్తుంది. జగన్‌ను కలసినవారిలో దబ్బలతోపాటు కళత్తూరు శేఖర్‌రెడ్డి, తడ ఎంపీపీ కొలవి రఘురెడ్డి, నాయకులు గండవరం సురేష్‌రెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, తిరుపాల్, శరత్‌యాదవ్ తదితరులున్నారు.



జగన్‌తో మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి తదితరులు



తిరుమలలో కొలువుదీరిన పంచమూర్తుల్లో ఒకరైన ఉగ్రశ్రీనివాసుడు ఏటా ఒకసారి మాత్రమే గర్భాలయం దాటి వస్తారు. కైశికద్వాదశి ఆస్థానం సందర్భంగా వేకువజామున మాడవీధుల్లో ఊరేగి.. సూర్యోదయానికి ముందే తిరిగి లోపలకు వెళ్లిపోతారు. శ్రీవారి ఆలయంలో బుధవారం ఈ ఉత్సవం జరగనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఇద్దరు అర్చకులకు షోకాజ్ నోటీసులు

ఎర్రావారిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరాలయంలో భక్తుల ఎదుటే ఘర్షణకు దిగిన ఇద్దరు అర్చకులకు దేవదాయశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆలయంలో ప్రసన్న కుమార్‌స్వామి, సత్యప్రసాద్‌లు అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో అప్పటి ఈఓ జయకుమార్ సిఫార్సుతో ప్రస్నకుమార్ స్వామి కుమారుడిని తాత్కాలిక అర్చకుడిగా నియమించారు. కొద్ది రోజులు అతను పనిచేశారు. అర్చకుల సెలవుల సందర్భంలో సేవలందిస్తున్నారు. ఈయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మరో అర్చకుడు సత్యప్రసాద్ దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అర్చకుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఇటీవల భక్తుల ఎదుటే కొట్టుకున్నారని సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో కూడా నమోదయ్యాయి. దీంతో ఆలయ ఈఓ మమత విచారించి మంగళవారం ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కాలువలో పడి చిన్నారి మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాలువలో పడి చిన్నారి మృతి చెందింది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మధు శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. నింద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడు.ఈ దంపతులు శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డులో సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య కల్పన గృహిణి. వీరికి నాల్గో తరగతి చదివే కుమారుడు, ఆరేళ్ల చిన్నారి లహరి ఉన్నారు. కుమార్తె లహరి మానసికంగా పరిణితి చెందలేదు. దీంతో ప్రత్యేక ప్రతిభావంతురాలైన బాలికను తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలోని భవిత కేంద్రంలో సోమవారం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామంలో లహరి భవిత కేంద్రం వద్ద అదృశ్యమైంది. సిబ్బంది వెంటనే బాలిక తల్లిదండ్రులు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అందరూ గాలించారు. భవిత కేంద్రం సమీపంలో కాలువలో పడి బాలిక మృతి చెందినట్లుగా కాసేపటి తరువాత గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చ్యురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లహరి (ఫైల్‌ఫొటో)

ఉగ్రశ్రీనివాసుడు

గడప దాటేది ఏడాదికోసారే

- 800 ఏళ్ల కిందటి వరకు ఈయనే ఉత్సవమూర్తి
- ఓ సంఘటనతో ఆ స్థానంలోకి మలయప్ప
- నేడు శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల గర్భాలయంలో మూలవిరాట్‌తో పాటు మరో నలుగురుమూర్తులు ఉంటారు. కోర్కెలు తీర్చేది ధృవబేరమైన మూలమూర్తి అయితే.. నిత్యసేవలు భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకబేరం) అందుకుంటారు. లెక్కలు అందుకునే స్వామి కొలువు శ్రీనివాస మూర్తి(బలిబేరం). మలయప్ప(ఉత్సవబేరం)ను భక్తులంతా తరచూ వీక్షిస్తుంటారు. ఉత్సవాల సమయంలో ఆలయం నుంచి బయటకు వివిధ వాహనాలపై దర్శనమిచ్చేది ఈ స్వామే. ఐదోవది స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి. ఈయన్ను 'వెంకటంతుౖరైవారు' అని కూడా పిలుస్తారు. 14వ శతాబ్దం వరకు ఉగ్రశ్రీనివాసుడే ఉత్సవమూర్తిగా ఉండేవారని పురాణోక్తి.

ఆ పేరు వెనుక..

ఉగ్రశ్రీనివాసుడని పేరు రావడానికి ఓ ఇతిహాసం ప్రాచుర్యంలో ఉంది. క్రీ.శ.1330 నాటి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తి ఊరేగుతుండగా ఈ స్వామిపై సూర్యకిరణాలు పడ్డాయట. దీంతో తిరుమలలో పెద్ద అగ్నిప్రమాదం జరిగి చాలా ఇళ్లు దగ్ధమయ్యాయట. ఈ క్రమంలోనే సమీపంలోని భక్తుల్లో ఒకరి ద్వారా 'ఇకపై నన్ను ఉత్సవమూర్తిగా వాడద్దు. అలా చేస్తే అగ్నిప్రమాదం వంటి అనర్థాలే జరుగుతాయి' అని స్వామి చెప్పారట. తిరుమల లోయల్లో తానే ఇంకొకమూర్తిగా శ్రీదేవి, భూదేవి సహా సహా ఉన్నానని, ఎక్కడ వెతకాలో గుర్తులు కూడా చెప్పారట. ఆ స్వామినే (ప్రస్తుత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి) ఉత్సవ మూర్తిగా కొలువుదీర్చాలని ఆదేశించారట. అప్పట్నుంచి ఉగ్రశ్రీనివాసమూర్తిగా పేరు వచ్చింది.

నేడు స్వామివారి ఊరేగింపు

ఏటా శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఆ ఒక్కరోజు మాత్రమే ఉగ్రశ్రీనివాస మూర్తి వేకువజాము ఆలయం నుంచి బయటకు వచ్చి నాలుగు మాడవీధుల్లో ఊరుగుతారు. సూర్యకిరణాలు పడకముందే తిరిగి స్వామిని ఆలయంలోకి తీసుకెళ్లిపోతారు. ఈ ఉత్సవం బుధవారం జరగనుంది.

మా డబ్బు మాకు వెనక్కివ్వండి

- తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15గంటలకు తిరుపతికి చేరుకుని తిరిగి హైదరాబాద్‌కు 8.15 గంటలకు వెళ్లాల్సిన ఎయిర్ అలయన్స్ విమానాన్ని సాంకేతిక కారణాలతో సోమవారం హైదరాబాద్‌లోనే రద్దు చేశారు.ఈ విమానంలో సోమవారం హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో కొంత మంది నగదు వెనక్కు తీసుకుని వెళ్లగా కొంత మంది మంగళవారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 40మంది మంగళవారం ఉదయం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. సాంకేతిక కారణాలతో విమానం రద్దయినట్టు సిబ్బంది చెప్పడంతో ప్రయాణికులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. ప్రతిసారీ ఇలా సాంకేతిక కారణాలు చూపుతూ రద్దు చేయడంపై సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బు వెనక్కిస్తే వేరే విమానంలో వెళతామని చెప్పగా సంస్థ సిబ్బంది సమాధానం చెప్పలేదు. దీంతో ప్రయాణికులు వారిని చుట్టుముట్టడంతో 48 గంటల తరువాత ప్రయాణికుల ఖాతాల్లో టిక్కెట్ల బుకింగ్ వాపస్ డబ్బు పడుతుందని చెప్పారు.దీంతో కొంతమంది వెనుదిరగ్గా మరికొంతమంది వేరే విమానంలో టిక్కెట్లు బుక్ చేసుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.



ఎయిర్ అలయన్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ఉన్న పంటను సాగు చేసుకోండి

- కళత్తూరు దళితులకు కలెక్టర్ భరోసా

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న భూముల్లో ప్రస్తుత సాగును పూర్తి చేసుకోవాలని కొత్తసాగుకు అనుమతి లేదని కలెక్టర్ చెప్పారు. మండలంలోని అటవీశాఖ భూ వివాదంపై మంగళవారం కళత్తూరు దళిత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, డీఎఫ్‌వో వివేక్‌ను కలిసి తమగోడును వినిపించారు. స్పందించిన అధికారులు ప్రస్తుతానికి వివాదంలో ఉన్న నేలలో జరుగుతున్న సాగును పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా పంటలు పెట్టొద్దని కలెక్టర్, డీఎఫ్‌వో చెప్పారు. దీంతో రైతులు ప్రస్తుతం వేరుశనగ సీజన్ కాబట్టి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరినా డీఎఫ్‌వో అంగీకరించలేదు. సాగులో ఉన్న పంటకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని మిగిలిన దాంట్లో అడుగుపెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. టవర్లను ఎక్కడం మానుకోవాలని హితవు పలికారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

టీడీపీ వర్క్‌షాప్‌కు బహిష్కృత ఎమ్మెల్యే

సత్యవేడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌కు ఆ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే ఆదిమూలం హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయనపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబరు 5న పార్టీ నుంచి సస్పెండు చేసిన విషయం తెలిసిందే. లైంగిక ఆరోపణల కేసు హైకోర్టులో వీగిపోవడంతో ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నియోజకవర్గ నాయకులు అధిష్ఠానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో బడ్జెట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరు కావడం స్థానికంగా చర్చకు దారి తీసింది.





మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సినీ హీరో మంచు విష్ణు



శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్న సినీ కథానాయకుడు వరుణ్‌తేజ్



క్యాన్సర్‌పై అవగాహన పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

రేపటి నుంచి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు

- ప్రతి బృందం రోజుకు 5 కుటుంబాలకు పరీక్షలు చేయాలన్న కలెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఇంటింటికి వెళ్లి నిర్వహించే క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఆయన స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వైద్యుడు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఈ నెల 18 నుంచి నిర్వహించే పలు వైద్య పరీక్షల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని వైద్యాధికారులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలను స్నేహపూర్వకంగా నిర్వహించాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనికి ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు 5 కుటుంబాలను కలిసి వైద్య పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారులతో కలిసి క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏది గోల్డు.. ఏది రోల్డు?

బ్యాంకుల్లో అసలు గోల్డ్ ఏదో, రోల్డ్ గోల్డ్ ఏదో తేల్చాల్సింది అప్రైజర్. బంగారు నాణ్యతను పరీక్షించి గ్రాముకు ఎంతివ్వాలో నిర్ణయించేదీ అతడే. అప్రైజర్‌ను మెప్పిస్తేనే అనుకున్న రుణం దొరుకుతుంది. లేకుంటే బంగారంలో రాళ్లున్నాయని కోతలేస్తుంటారు. అదే అప్రైజర్ తలుచుకుంటే నకిలీ బంగారు కూడా అసలైపోతుంది. తాజాగా తిరుపతి టౌన్‌బ్యాంకులో ఓ అప్రైజర్ చేతివాటం బ్యాంకు వర్గాల్లో కలకలం రేపింది. ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- టౌన్ బ్యాంకులో అప్రైజర్ చేతివాటం
- కుటుంబ సభ్యుల పేరిట నకిలీ బంగారం తాకట్టు
- ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సస్పెన్షన్
- ఆందోళనలో ఖాతాదారులు



వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన తిరుపతి టౌన్ బ్యాంకులో అప్రైజర్లు చేతివాటం చూపించడం ఇది రెండోసారి. 30 ఏళ్ల కిందట ప్రభాకర్ అనే అప్రైజర్ దొంగ బంగారం తనఖాపెట్టి వేలల్లో కాజేసి దొరికిపోయాడు. తాజాగా టౌన్‌బ్యాంకుతిరుమల శాఖలో చేరిన రూపేష్ తన భార్య, అమ్మ పేరిట నకిలీ బంగారం పెట్టి రూ.ఆరు లక్షలు కాజేయడంతో ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది. ఏడాది తర్వాత రెన్యువల్ చేసుకునే క్రమంలో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయించగా అసలు గుట్టు ఆలస్యంగా బయటపడింది. విచారణలో వెల్లడికావడంతో నగదును రికవరీ చేసి విధులనుంచి సస్పెండ్ చేశారు. కాగా, టౌన్ బ్యాంకులోని వివిధ శాఖలో ఐదుగురు అప్రైజర్లు పనిచేస్తున్నారు. గతంలో తరుచూ అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఒకేశాఖలో దీర్ఘకాలం ఉండేవారు. దీంతో అవకతవకలకు పాల్పడే అవకాశం ఏర్పడింది. ఇందులో భాగంగానే తిరుమల బ్యాంకులో పనిచేసే రూపేష్ తన చేతివాటాన్ని చూపాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రైజర్ల అంతర్గత బదిలీలు చేయడంతో నకిలీ బంగారం వెలుగులోకి వచ్చింది. లేకుంటే అదే అప్రైజర్ ఉండుంటే ఈ నకిలీ బంగారం రెన్యువల్ అయిపోయేది. కాగా, గతంలో టౌన్‌బ్యాంకులోని అన్ని శాఖల్లో రోజుకు రూ.50లక్షల వరకు బంగారు రుణాలను ఖాతాదారులు పొందేవారు.బ్యాంకు మీద విశ్వాసం సన్నగిల్లడంతో ప్రస్తుతం రూ.20లక్షల రుణాలు కూడా తీసుకోవడంలేదు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని శాఖల్లో తనఖా ఉన్న బంగారాన్ని తనిఖీ చేసి ఖాతాదారులకున్న అనుమానాలను తెరదించాల్సిన బాధ్యత టౌన్‌బ్యాంకు పాలకమండలి, అధికారయంత్రాంగంపై ఉంది.అడ్డంగా దొరికినప్పుడు ఉద్యోగం నుంచి తప్పించి చేతులు దులుపుకొంటున్నారే గానీ చట్టపరమైన చర్యలకు బ్యాంకు వర్గాలు వెనకడుగు వేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

జాతీయ బ్యాంకుల్లోనూ..

కోఆపరేటివ్ బ్యాంకుల్లోనే కాకుండా జాతీయ బ్యాంకుల్లోనూ అప్రైజర్లు అప్పుడప్పుడూ నకిలీ బంగారం పెట్టి నగదు స్వాహా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయ బ్యాంకుల్లో కమీషన్ పద్ధతి కింద అప్రైజర్లు పనిచేస్తుంటారు. ఏళ్ల తరబడి ఒకే శాఖలో ఉండటంతో అవకతవకలు జరిగే అవకాశంలేకపోలేదు. 'దొరికినవాడు దొంగ దొరకనివాడు దొర' అన్నట్టుగా కొందరు అప్రైజర్లు చెలామణి అవుతున్నారన్న విమర్శలున్నాయి.

తనఖా బంగారాన్నంతా తనిఖీ చేస్తున్నాం

టౌన్ బ్యాంకు పరిధిలోని తనఖా ఉన్న బంగారన్నంతా తనిఖీ చేస్తున్నాం. ఇప్పటికే తిరుమల శాఖలో బంగారాన్ని పరిశీలించాం. పునఃతనిఖీ కోసమే మాజీ సీనియర్ అప్రైజర్ ఎం.వేదాచలంను నియమించాం. ఆయా శాఖల మేనేజర్లతో కలిసి తనఖాలో ఉన్న బంగారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని లేఖలు రాశాం. రూపేష్‌ను సస్పెండ్ చేశాం. కమిటీ నిర్ణయం తర్వాత డిస్మిస్ చేస్తాం. ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి అప్రైజర్లను అంతర్గతంగా బదిలీచేసేలా నిర్ణయం తీసుకున్నాం. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. వారి బంగారు సురక్షితం.

- శివకుమార్‌రెడ్డి, ఎండీ, తిరుపతి టౌన్ బ్యాంకు

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీవో కిరణ్మయి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల అధికారులకు సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రైతుల ఓటర్లు చేర్పులు తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సేవలు అందించేలా చర్యలు

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు, రైతులకు మెరుగైన సేవలు అందించేలా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చర్యలు చేపట్టారని ఆయన ఓఎస్డీ సాంబశివరావు అన్నారు. మంగళవారం నెల్లటూరు గ్రామంలోని విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్‌ను ఓఎస్డీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు సంబంధించి విద్యుత్ సరఫరా అందజేసే ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలను సకాలంలో అందజేసి సమస్యలు లేకుండా చర్యలు చేపట్టేందుకు జిల్లా స్టోర్స్‌ను పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఈఈ నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని నెల్లూరు జడ్పీ సీఈవో రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, సంఘబంధం సభ్యులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను సర్పంచులు, వార్డు సభ్యులతో చర్చించి ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రధానంగా సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో మధుసూదనరావు, మోహన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి

వాకాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో రామమోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆయన వాకాడు మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఎంపీడీవో అన్నపూర్ణారావుకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు పంచాయతీల్లో శానిటేషన్, స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని జడ్పీ సీఈవో ఆదేశించారు.

క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని చిన్ని, సానా సతీష్ కృషి చేస్తున్నారని అసోసియేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలోని ఏసీఏ సబ్‌సెంటర్‌ను, డీఆర్‌డబ్ల్యు కళాశాలలోని క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక స్టేడియంలోని సబ్‌సెంటర్‌కు అవసరమైన కాంక్రీట్ పిచ్, ఆస్ట్రోటర్ఫ్ వసతులను ఏర్పాటు చేసేందుకు నివేదికలను రూపొందించి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మునిగిరీష్, తిరుపతి జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసమూర్తి, సతీష్‌యాదవ్, లవకుమార్, మహేష్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే టీవీఎస్ లక్ష్యం



బంగారుపేట పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న జయసింగ్

వెంకటగిరి టౌన్, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల అభ్యున్నతే శ్రీ శ్రీనివాస సేవా ట్రస్టు(టీవీఎస్) వెంకటగిరి క్లస్టర్ ఇన్‌ఛార్జి జయసింగ్ అన్నారు. మంగళవారం వెంకటగిరి మండలంలోని గుండ్ల సముద్రం, పట్టణంలోని బంగారుపేట పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011 నుంచి వెంకటగిరి మండలంలో రూ.2.70కోట్లతో 70గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఇప్పటి వరకు 78 ప్రభుత్వ పాఠశాలలు, 3 హెల్త్ సెంటర్లు, 24 అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేశామన్నారు. అలాగే గుండ్ల సముద్రం ఎస్టీ కాలనీలో 22 మంది పేదలకు ఇళ్లు కట్టిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారులు పాల్గొన్నారు.

గోతుల దారుల్లో కుంటలు

- చినుకురాలితే రొచ్చురొచ్చుగా రోడ్లు
- నరకప్రాయంగా ప్రయాణం





దుస్థితిలో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు - సాయినగర్ రోడ్డు - జీఎస్‌టీ రోడ్డు





పోలీస్ స్టేషన్ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసలే గోతులు తేలిన రోడ్లు... చినుకు పడితే చాలు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దారులన్నీ బురదమయంగా మారి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేటలో మంగళవారం వేకుజామున నుంచి జల్లులతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు రొచ్చురొచ్చుగా మారింది. జాతీయ రహదారి నుంచి పట్టణానికి వెళ్లే జీఎస్‌టీ రోడ్డు గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో వాహన దారులకు నరకాన్ని చూపుతోంది. హోలిక్రాస్ కూడలి నుంచి కేఏస్ సూపర్ మార్కెట్ వరకు ప్రధాన రోడ్డు గోతులమయంగా మారి నీరు నిలిచి చెరువును తలిపిస్తోంది. గాండ్లవీధి, సాయినగర్, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్లూ అధ్వానంగా మారాయి. జీఎస్‌టీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, షార్ బస్టాండు సమీపంలో మురుగు కాలువలు పొంగి రోడ్లపైకి చేరింది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలు కూడా వర్షానికి రొచ్చురొచ్చు మారాయి.





పెళ్లకూరు మండలం టెంకాయతోపు వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు - పెళ్లకూరులో దుక్కి సిద్ధం చేస్తున్న రైతులు

ఊపందుకున్న రబీ సాగు

జోరుగా వరినాట్లు



సూళ్లూరుపేట: వరినాట్లకు నారుతీస్తున్న కూలీలు

పెళ్లకూరు/సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రబీ వరిసాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల్లో దుక్కి సిద్ధం చేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో వరికి నారుమడులు వేశారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, పసుపుకండ్రిగ తదితర గ్రామాల్లో నాట్లు వేస్తుండగా, రావులపాడు, బీమవరం, పునబాక, శిరసనంబేడు, అర్దమాల, ఆర్లపాడు తదితర గ్రామాల్లో నారుమడులు పోస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు తెలుగుగంగ నీళ్లు చెరువులకు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. ఇదేరీతిలో వర్షాలు కొనసాగితే పంటలు సాగు మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. చెన్నప్పనాయుడుపేట, నందిమాల ఆర్లపాడు బంగారంపేట, మోదుగులపాలెం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఎల్ది ఫైర్లకు ప్రస్తుత వర్షాలు ఊపిరిపోశాయి.గత పది రోజులుగా చినుకు లేకపోవడంతో ఎల్ది ఫైర్లు ఎండుముఖం పట్టాయి. సోమవారం నుంచి ప్రారంభమైన వర్షం ఎల్ది ఫైర్లు సాగు చేస్తున్న రైతులకు ఊరటనిచ్చింది. ● సూళ్లూరుపేట మండలంలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కుదిరి, చెరువు కండ్రిగ, మంగళంపాడు, ఇలుపూరు, మన్నారుపోలూరు తదితర గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

తీర్థంపాడు వీఆర్వో సస్పెన్షన్

దక్కిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం తీర్థంపాడు వీఆర్వో కోటిరెడ్డిని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు అందినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. వీఆర్వోగా కోటిరెడ్డి తన పరిధిలో లేని పలుడుగోడు గ్రామంలో ఓ భూమికి సంబంధించి శిస్తు కట్టించుకొని రసీదులు, అడంగళ్, ఎంజాయ్‌మెంట్ పత్రం ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దారు విచారించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. దీంతో వీఆర్వో కోటిరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది.

మూడు చోట్ల పిడుగులు

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూడు చోట్ల మంగళవారం తెల్లవారుజామున పిడుగులు పడ్డాయి. సోమవారం రాత్రి 12 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 2 గంటల వరకు భారీ వర్షం కురిసింది. వంజివాకలోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. అలాగే ఉచ్చూరు వారిపాళెంలో ఓ ఇంటి మేడ మెట్లపై పిడుగుపడటంతో పెచ్చులూడిపోయింది. శ్యామసుందరపురంలో రెండంతస్తుల మేడపై ఉన్న ప్లాస్టిక్ నీళ్ల ట్యాంక్‌పై పిడుగుపడటంతో ఆ ట్యాంక్ రెండుగా చీలిపోయింది.

సూపర్ సిక్స్ పథకాలకు నిధుల కేటాయింపు హర్షణీయం

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్ కోట్లాది రూపాయలు నిధులు కేటాయించడం హర్షణీయమని టీడీపీ జిల్లా కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 1 నుంచి ఇంటర్ వరకు చదివే ప్రతి బిడ్డకు రూ.15వేలు అందించేందుకు ప్రవేశపెట్టిన తల్లికి వందనం పథకానికి రూ.6,847 కోట్లు, ఆడ బిడ్డ నిధి పథకానికి రూ.3,340 కోట్లు, అన్నదాత పథకానికి రూ.1000, డ్వాక్రా మహిళల సున్నావడ్డి పథకానికి రూ.1250 కోట్లు కేటాయించడం అభినందనీయమని అన్నారు.

టీచ్ టూల్‌పై శిక్షణ

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోటలోని విద్యావనరుల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్‌లకు టీచ్ టూల్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. తిరుపతి సమగ్రశిక్ష అభియాన్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్ కోఆర్డినేటర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల స్థాయిలో విద్యార్థులకు బోధన జరిగేటప్పుడు రీసోర్స్ పర్సన్లు బోధన విధానంపై తనిఖీలు చేయాలన్నారు. అదే విధంగా ఉన్నత పాఠశాలల స్థాయిలో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అంతే కాకుండా అపార్ ఐడీ జనరేషన్ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో మస్తానయ్య పాల్గొన్నారు.

కార్తీక పూజలు

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడలిలోని కామాక్షీ సమేత సంఘమేశ్వర ఆలయంలో మంగళవారం కార్తీకమాస పూజలు జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్ స్వామి ఆధ్వర్యంలో సంఘమేశ్వరుడు మూల విరాట్‌కు అభిషేకాలు చేసి విశేష అలంకరణలో ఉంచారు.


గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను నడపండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను నడపాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి తిరుమలకు నేరుగా 14 బస్సు సర్వీసులు నడిస్తుండగా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీవారి భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌లో రైళ్లు దిగి తిరుమలకు వెళ్తుంటారని అన్నారు. గూడూరు నుంచి తిరుమలకు నేరుగా బస్సు సర్వీసులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సులను తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయండి



మంత్రి నారాయణకు సమస్యలను వివరిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఖాళీలను భర్తీ చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరునారాయణను కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికితీసుకెళ్లారు. మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉండగా కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం వల్ల పాలన స్తంభించిపోతోందన్నారు. మున్సిపాలిటీ ఏర్పడ్డప్పుడు నిర్మించిన తాగునీటి పైపు లైన్లు దెబ్బతినడంతో తరుచూ పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కొత్త పైపులైను నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే రామకృష్ణ తెలిపారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు రూ.23 వేల జరిమానా

చిల్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి చిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పునిచ్చారు. 2021లో చిల్లకూరు మండలంలోని బూదనం గ్రామానికి చెందిన మస్తాన్‌బాబు ఓ బాలిక బహిర్భూమికి వెళ్లిన సమయంలో అత్యాచారం చేశాడు. మస్తాన్‌బాబుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తర కొరియాకు చెందిన బహుళజాతి సంస్థ స్నోవాసిస్ మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు కిషోర్, రాజేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 119మంది రెండో రౌండ్‌కు అర్హత సాధించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి కిషంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరకం విద్యార్థుల పడవలకు ఇంజన్ల వితరణ

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇరకం విద్యార్థులు ప్రయాణించే పడవలకు అవసరమైన ఇంజన్లను ఓ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందజేసింది. ఇరకం గ్రామస్థులు కొద్ది రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలుసుకొని పడవల విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ మత్స్యశాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. మత్స్యశాఖ డీఈ నాగరాజు, ఓ స్వచ్ఛంద సంస్థకు తెలియజేసి రెండు పడవలకు నాలుగు మోటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంగళవారం సుమారు రూ.1.57 లక్షల వ్యయంతో నాలుగు మోటర్లను ఇరకం గ్రామస్థులకు అందజేశారు.

పులికాట్ పూడికతీతకు బడ్జెట్ కేటాయింపు హర్షణీయం

తడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పులికాట్ పూడికతీతకు బడ్జెట్‌లో కేటాయింపు చేయడం హర్షణీయమని టీడీపీ మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మత్స్యకార నాయకుడు బొమ్మన శ్రీధర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు ముఖద్వారాలు పూడిపోయి మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇక పులికాట్ పునర్వైభవం సంతరించుకుని మత్స్యకారుల జీవితాలు మెరుగుపడు తాయన్నారు.

టెంకాయతోపు సమస్య పరిష్కారానికి కృషి

పెళ్లకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారి ఎత్తులో ఉండడంతో పక్కనే ఉన్న టెంకాయతోపు గ్రామం లోతట్టు ప్రాంతంగా మారింది. వర్షం పడినప్పుడల్లా గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం మొదలైనప్పటి నుంచి వర్షం పడితే చాలుగ్రామంలో నీరు నిల్వ చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు టెంకాయతోపు గ్రామంలోకి నీరు చేరడంతో టీడీపీ నాయకులు పరిశీలించారు. దామెర ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ టెంకాయతోపు గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైన్‌లు నిర్మించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నిధులు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రసాద్

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎస్‌ఐఆర్‌డీ పరిశీలికులు ఏ.ప్రసాద్, పీవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగరమాల నిర్వాసితులతో గ్రామసభ

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం, ఊనుగుంటపాళెం పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం సాగరమాల భూ నిర్వాసితులతో గ్రామసభ జరిగింది. కోట, వాకాడు తహసీల్దార్లు జయజయరావు, రామయ్య, సర్వేయర్ గోపీరెడ్డి రైతులతో చర్చించారు. సాగరమాల రోడ్డు నిర్మాణంలో రైతులు ఎంత మేర భూములు కోల్పోయారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులకు సంబంధించిన భూములు ఆన్‌లైన్‌లో తేడాలు వస్తుండటంతో పరిశీలించి అర్హులైన వారిని గుర్తించారు. సాగరమాల రోడ్డు పనులను అడ్డుకోవద్దని, అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్లు చెప్పారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

పెళ్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయతోపు గ్రామంలో బెల్టు షాపుపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మురళీని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 8 బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

మునిరాజకు ఉత్తమ అధ్యాపక అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న మునిరాజ

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం తిరువెంగలాయపల్లి గ్రామానికి డాక్టర్ మునిరాజ నెల్లూరులోని కేఏసీ జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డును అందుకున్నారు.

పరసాకు పరామర్శ

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుండె శస్త్ర చికిత్స చేయించుకొని స్వగ్రామం గొట్టిప్రోలులో విశ్రాంతి తీసుకొంటున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో స్థానిక శ్రీనివాస గిరిజన కాలనీకి చెందిన ప్రసాద్ మృతి చెందాడు. మంగళవారం గ్రామస్తులందరూ కలిసి ప్రసాద్ కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. నరేష్, కొషిక్‌రెడ్డి, గాలి ప్రకాష్‌నాయుడు, నాగరాజు, కిషోర్, మధు పాల్గొన్నారు.